www.epaper.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

మంగళవారం 27 జనవరి 2026

సంగారెడ్డి సంచిక : 192 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## మధ్యప్రాచ్యానికి మారిన భారత చమురు కొనుగోళ్లు

భారత్ ముడి చమురు కొనుగోలు విధానాల్లో మార్పులు చేస్తోంది. అమెరికా ఆంక్షల కారణంగా రష్యా చమురు కొనుగోలు క్లిష్టంగా మారిన నేపథ్యంలో భారత్ ఇప్పుడు సురక్షితమైన వనరులను ఎంచుకుంటోంది. రియల్ టైమ్ అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ డేటా ప్రకారం, రష్యన్ ముడి చమురు దిగుమతి జనవరి మొదటి మూడు వారాల్లో రోజుకు 1.1 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది, ఇది గత నెలలో సగటున 1.21 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది. 2025 మధ్యలో 2 మిలియన్ బ్యారెళ్లతో పోలిస్తే దిగుమతులు గణనీయంగా తగ్గాయి. ఈ క్రమంలో భారత్ ఇరాక్, సౌదీ అరేబియా వంటి మధ్యప్రాచ్య దేశాల నుంచి ఎక్కువ చమురును కొనుగోలు చేయడం ప్రారంభించింది.

# గ్లోబల్ స్కిల్‌హబ్‌గా తెలంగాణ

“మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా తెలంగాణ ముందుకు సాగుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. రైజింగ్ తెలంగాణ-2047 సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుందని తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.

## జాతీయ జెండా ఎగరేసిన గవర్నర్



- తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ స్కిల్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు
- గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క
- “మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా తెలంగాణ సాగుతోంది
- ప్రజాప్రభుత్వం ఇటీవలే రైజింగ్ తెలంగాణ డాక్యుమెంట్ ఆవిష్కరించింది
- తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు
- కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం, మంత్రులు, స్పీకర్
- అసెంబ్లీ, మండలి, సచివాలయంలోనూ రిపబ్లిక్ డే సంబరాలు

హైదరాబాద్

తెలంగాణ వ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అధికారిక కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు. అంతకుముందు తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలిలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్ర సచివాలయంతో పాటు జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లోనూ రిపబ్లిక్ డే వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో దేశభక్తి వాతావరణం - మిగతా3లో





## రిపబ్లిక్ డే పరేడ్ దేశ ప్రతిష్ఠకు శక్తిమంతమైన ప్రతీక

- గణతంత్ర దినోత్సవ పరేడ్ జాతీయ గర్వానికి నిదర్శనమని ప్రధాని మోదీ అన్నారు
- పరేడ్ మన ప్రజాస్వామ్య బలాన్ని, వారసత్వ సంపదను చాటిచెప్పిందని ప్రశంస
- వేడుకల అనంతరం సంప్రదాయాన్ని పక్కనపెట్టి కర్తవ్యపథ్‌లో నడిచిన ప్రధాని
- ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన మోదీకి ఘన స్వాగతం
- భారత భద్రతా వ్యవస్థల శక్తిసామర్థ్యాలు అద్భుతమని కొనియాడిన ప్రధాని

## భిన్నత్వంలో ఏకత్వం..

- తలపాగాతో సందేశమిచ్చిన ప్రధాని మోదీ
- 77వ గణతంత్ర వేడుకల్లో రాజస్థానీ తరహా తలపాగాతో ప్రధాని
- ఎరుపు రంగు టై-డై వస్త్రంపై బంగారు జరీ వర్క్‌తో ప్రత్యేక ఆకర్షణ
- ప్రతి ఏటా విభిన్న సంస్కృతులకు ప్రతీకగా తలపాగాలు ధరిస్తున్న మోదీ
- గతేడాది ఎరుపు, పసుపు రంగుల బాంధేజ్ తలపాగా ధరించిన ప్రధాని





## రష్యాలో కార్మికుల కొరత..

- భారీగా భారతీయుల నియామకానికి రంగం సిద్ధం
- కార్మికుల కొరతతో రష్యాలో భారీగా భారతీయ నియామకాలు
- ఈ ఏడాది 40,000 మందిని తీసుకోనున్నట్లు అంచనా
- కార్మికుల తరలింపుపై ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు
- రష్యాలో 30 లక్షల మంది నైపుణ్య నిపుణుల కొరత



## భారత్ తో ట్రేడ్ డీల్‌కు ఆ ముగ్గురూ అడ్డుపడ్డారు

- ట్రంప్ పై సెనేటర్ విమర్శలు
- ట్రంప్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు
- అధ్యక్షుడిపై ఆరోపణలు గుప్పించిన టెక్సస్ సెనేటర్ టెడ్ క్రూజ్
- టారిఫ్‌లు వద్దన్నందుకు ట్రంప్ తనపై అరిచాడని వెల్లడి

# ఇందిరమ్మ ఇళ్లపై గుడ్‌న్యూస్



- త్వరలో వారికి స్థలంతో పాటు ఇళ్లు ఫ్రీ..
- పట్టణ ప్రాంతాల్లోని పేదలకు త్వరలో ఉచితంగా 72 గజాల స్థలం
- తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం లక్షల మంది అర్హులు ఎదురుచూస్తున్నారు
- తమకు ప్రభుత్వం నుంచి ఎప్పుడెప్పుడు మంజూరు అవుతాయా అని కళ్లు కాయలు కాసేలా చూస్తున్నారు
- వీరికి తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది
- త్వరలో వారికి ఇంటి స్థలంతో పాటు ఇళ్లను మంజూరు చేయనుంది

హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని వెంటనే ప్రారంభించి అర్హులైనవారికి కొత్త ఇళ్లను మంజూరు చేస్తోంది. దశలవారీగా అర్హులకు ఇళ్లను మంజూరు చేస్తూ నిధులు విడుదల చేస్తోంది. ఇళ్లు పూర్తయ్యే దశలను బట్టి ప్రతీవారం లబ్దిదారులకు నిధులు విడుదల చేస్తోంది. ప్రస్తుతం గ్రామాలు, పట్టణాల్లో ఇల్లు కట్టుకోవాలను కునేవారికి లబ్ది చేకూర్చుతుండగా.. త్వరలో నగరాల్లో ఉంటున్నవారికి కూడా ఇళ్లను - మిగతా3లో



## హైదరాబాద్‌లో చిన్నారి ప్రాణాలు తీసిన చైనా మాంజా

- కూకట్‌పల్లిలో మాంజా కారణంగా ఐదేళ్ల బాలిక మృతి
- ఇద్దరు కుమార్తెలతో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఘటన
- బాలిక మెడకు చుట్టుకుని కిందపడి అక్కడికక్కడే మృతి

హైదరాబాద్

చైనా మాంజా కారణంగా మరో విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లిలో ఐదేళ్ల బాలిక మాంజా కారణంగా ప్రాణాలు కోల్పోయింది. మేడ్చల్ జిల్లా ఖాజీపల్లి నుంచి తండ్రితో పాటు ఇద్దరు - మిగతా3లో




## తగ్గనున్న కార్ల ధరలు!

- భారత్, ఈయూ మధ్య చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం..
- విజయవంతమైన భారత్ ప్రపంచానికి ఎంతో మేలు చేస్తుందన్న ఈయూ అధ్యక్షురాలు
- భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందానికి రంగం సిద్ధం
- ఈ ఒప్పందంతో 200 కోట్ల మందితో అతిపెద్ద మార్కెట్ ఏర్పాటు
- యూరప్ నుంచి దిగుమతి అయ్యే కార్లపై సుంకాలు భారీగా తగ్గే అవకాశం

## కర్తవ్యపథ్‌లో రిపబ్లిక్ డే

### జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము

- కర్తవ్యపథ్‌లో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు
- వేడుకలపై పూలవర్షం కురిపించిన 4 ఎంఐ-17 హెలికాప్టర్లు
- పరేడ్‌లో పాల్గొన్న ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక బృందం
- ఆపరేషన్ సిందూర్ ఆయుధ వ్యవస్థను ప్రదర్శించిన త్రివిధదళాలు



# రిపబ్లిక్ డే పరేడ్ దేశ ప్రతిష్ఠకు శక్తిమంతమైన ప్రతీక

77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశరాజధాని ఢిల్లీలో అంబరాన్నంటాయి. కర్తవ్యపథ్‌లో జరిగిన అద్భుతమైన పరేడ్ ముగిసిన అనంతరం, ఈ వేడుకలు "దేశ ప్రతిష్ఠకు శక్తిమంతమైన ప్రతీక" అని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈ మేరకు సోమవారం ఆయన సోషల్ మీడియాలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ వేడుకల ద్వారా భారతదేశ ప్రజాస్వామ్య బలం, సాంస్కృతిక వారసత్వ సంపద, దేశాన్ని ఏకతాటిపై నిలిపే ఐక్యత ప్రదర్శితమయ్యాయని ఆయన పేర్కొన్నారు. దేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంతో, గర్వంతో జరుపుకుందని ప్రధాని తెలిపారు. "గణతంత్ర దినోత్సవ పరేడ్, భారతదేశ అద్భుతమైన భద్రతా వ్యవస్థను ప్రదర్శించింది. ఇది మన దేశ సంసిద్ధత, సాంకేతిక సామర్థ్యం, పౌరులను రక్షించడంలో మనకున్న అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది" అని మోదీ మరో పోస్ట్‌లో వివరించారు. మన భద్రతా దళాలు నిజంగా దేశానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. పరేడ్ ప్రారంభానికి ముందు, ప్రధాని మోదీ జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించి, దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడంతో గణతంత్ర వేడుకలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ పరేడ్‌లో భారత సైన్యం తొలిసారిగా 'బ్యాటిల్ అర్రే' ఫార్మాట్‌లో తమ యుద్ధ నైపుణ్యాలను ప్రదర్శించింది. స్వదేశీ ఆయుధాలు, క్షిపణి వ్యవస్థలతో పాటు, వివిధ రాష్ట్రాలు, మంత్రిత్వ



శాఖలకు చెందిన శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు కర్తవ్యపథ్‌లో కనువిందు చేశాయి. ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా ప్రధాని మోదీ పరేడ్ ముగిశాక ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి కర్తవ్యపథ్‌లో నడిచారు. ఆయన చాలా దూరం నడుస్తూ, ఇరువైపులా ఉన్న ప్రేక్షకులకు అభివాదం చేశారు. ప్రధానిని చూసిన ప్రజలు 'భారత్ మాతా కీ జై', 'మోదీ–మోదీ' నినాదాలతో హోరెత్తించారు. చేతిలో త్రివర్ణ పతాకాలు పట్టుకుని, ఉత్సాహంగా ఆయనకు స్వాగతం పలికారు. చిన్నారులు కుర్చీలపైకి ఎక్కి మరీ ప్రధానిని చూసేందుకు ఆసక్తి చూపారు. కొంత దూరం నడిచిన తర్వాత, ప్రధాని తన వాహనంలోకి ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. రాజస్థానీ సంప్రదాయ తలపాగా, నెమలి ఈకల అలంకరణతో మోదీ తన ప్రత్యేకమైన వస్త్రధారణతో మరోసారి ఆకట్టుకున్నారు.

# కర్తవ్యపథ్‌లో రిపబ్లిక్ డే

దేశ రక్షణ సామర్థ్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ 77వ గణతంత్ర వేడుకలు దేశ రాజధాని దిల్లీలో అంబరాన్నంటాయి. కర్తవ్యపథ్‌లో జరిగిన వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. తొలుత రాష్ట్రపతి భవన్ నుంచి విదేశీ అతిథులతో కలిసి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంప్రదాయ గుర్రపు బగ్గీలో అశ్విక దళంతో కలిసి కర్తవ్యపథ్‌కు బయలుదేరారు. కర్తవ్య పథక్‌కు చేరుకున్న రాష్ట్రపతికి, విదేశీ అతిథులు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌కు ఉపరాష్ట్రపతి, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు స్వాగతం పలికారు. వేదికపైకి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు. వెంటనే సైనికులు గౌరవ సూచకంగా శతఘ్నులు పేల్చారు.

**శుభాంశుశుక్లాకు అశోకచక్ర పురస్కారం ప్రదానం చేసిన రాష్ట్రపతి**

అనంతరం రోదసీ యాత్ర చేసిన గ్రూప్ కెప్టెన్ శుభాంసు శుక్లాకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అశోక్ చక్రను ప్రదానం చేశారు. తర్వాత జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో మొదట కళాకారులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల కళాకారులు తమ వాద్య పరికరాలతో వన్ ఇండియా స్ఫూర్తిని చాటారు. నాలుగు వీ×–17 హెలికాప్టర్లు సభికులపై పూల వర్షం కురిపించాయి. సైన్యంలో వివిధ విభాగాలకు నాయకత్వం వహిస్తున్నసైనిక ఉన్నతాధికారులు రాష్ట్రపతికి వందనం సమర్పించారు. అనంతరం యూరోపియన్ యూనియన్‌కు చెందిన సైనికులు కర్నల్ ఫ్రెడరిక్ సైమన్ నేతృత్వంలో వందనం సమర్పించారు. తర్వాత భారత సైనిక సామర్థ్యాన్ని చాటుతూ జరిగిన పరేడ్



ఆద్యంతం ఆకట్టుకుంది. ఆశ్విక దళం తర్వాత వివిధ ఆయుధాలను ప్రదర్శించారు. ఇదే సమయంలో మూడు ధ్రువ్ హెలికాప్టర్లు ఆపరేషన్ సిందూర్ జెండాను ప్రదర్శించాయి.

ఒక పక్క టీ–90 అర్జున యుద్ధ ట్యాంకులు, టీ–90 భీష్మ యుద్ధ ట్యాంకులు పరేడ్‌లో ప్రదర్శనకు రాగా అదే సమయం లో గగన తలంలో అపాచీ హెలికాప్టర్లు దూసుకెళ్లాయి. బీఎంపీ–3 ఇన్‌ఫాంట్రీ యుద్ధ వాహనం, నాగ్ మిసైల్ వ్యవస్థను ప్రదర్శించారు. అన్ని రకాల ఉపరితలాలపైనా ప్రయాణించే వాహనాలు, మనుషులు లేకుండానే నియంత్రించే యుద్ధ వాహనాలను ప్రదర్శించారు. పైలెట్లు అవసరం లేకుండానే లక్ష్యాలను కచ్చితంగా మానవ రహిత విమానాలైన దివ్యాస్త్ర, శక్తిబాన్‌లు ఆకట్టుకున్నాయి. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన ధనుష్, అమోఘ్ గన్ వ్యవస్థలు పరేడ్‌లో పాల్గొన్నాయి. 52 కాలిబర్ ఆర్టిలరీ గన్స్, దేశ రక్షణకే తలమానికమైన బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థ, సూర్యాస్త్ర క్షిపణి వ్యవస్థలు ఆకట్టుకున్నాయి. శత్రులక్ష్యాలను చేధించడమే కాకుండా ప్రత్యర్థులు ప్రయోగించే ఆయుధాలను నిర్వీర్యం చేసే శక్తి ఉన్న ఆకాశ్ గగనతల రక్షణ వ్యవస్థ, అభ్ర ఆయుధ వ్యవస్థలను పరేడ్‌లో ప్రదర్శించారు. ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాల కోసం అభివృద్ధి చేసిన మీడియా రేంజ్ మిసైల్ వ్యవస్థ కూడా పరేడ్‌లో పాల్గొంది. భారత సైన్యానికి చెందిన డ్రోన్ శక్తిని ఈగల్ ఆన్ ఆర్మ్ పేరుతో ప్రదర్శించారు.ఆపరేషన్ సిందూర్ సమయంలో త్రివిధ దళాలను సమన్వయ పరిచిన ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్ సెంటర్ నమూనా ఆకట్టుకుంది.

**గణతంత్ర దినోత్సవం వేళ అమరవీరులకు ప్రధాని మోదీ నివాళి**

అంతకుముందు గణతంత్ర దినోత్సవం వేళ దేశం కోసం పోరాడిన అమరవీరులకు ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. తొలుత దిల్లీలోని వార్ మెమోరియల్ వద్దకు వెళ్లిన ప్రధానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రివిధ దళాధిపతులు స్వాగతం పలికారు. తర్వాత వార్ మెమోరియల్ వద్దకు చేరుకున్న ప్రధాని మోదీ పుష్పాంజలి సమర్పించారు. దేశం కోసం పోరాడిన వీరులకు, త్రివిధ దళాల అధిపతులతో కలిసి వందనం చేశారు. తర్వాత అక్కడి పుస్తకంలో తన సందేశం రాశారు.

**సైనికులతో పరేడ్**

6,050 మంది సైనికులతో పరేడ్
17 రాష్ట్రాలు, 13 కేంద్ర ప్రభుత్వ శకటాలను ప్రదర్శన
30 వేల మంది పోలీసులు, కేంద్ర బలగాలతో భద్రత ఏర్పాట్లు
కర్తవ్య పథ్ దగ్గర 6 కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు
దేశ రక్షణ సామర్థ్యాన్ని చాటిచెప్పే విధంగా జరిగే కవాతు
ఆయుధ ప్రదర్శన వైమానిక విన్యాసాలు
గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలీసులు ఏఐ స్మార్ట్ కళ్లజోళ్లతో నిఘా ఏర్పాట్లు

# రష్యాలో కార్మికుల కొరత..


తీవ్రమైన కార్మికుల కొరతను ఎదుర్కొంటున్న రష్యా, ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు భారత్ వైపు చూస్తోంది. ఈ ఏడాది దాదాపు 40,000 మంది భారతీయ కార్మికులను నియమించుకోవడానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే సుమారు 70,000 నుంచి 80,000 మంది భారతీయులు గత ఏడాది చివరి నాటికి రష్యాలో పనిచేస్తున్నట్లు అంచనా. భారతదేశం నుంచి నైపుణ్యం, పాక్షిక నైపుణ్యం ఉన్న కార్మికులను రష్యాకు పంపించే ప్రక్రియను సులభతరం చేసేందుకు గత డిసెంబర్‌లో ఇరు దేశాలు రెండు కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాల ద్వారా కార్మికుల తరలింపు ప్రక్రియను క్రమబద్ధీకరించడంతో పాటు, గతంలో జరిగిన మోసాల వంటివి పునరావృతం కాకుండా వారికి



రక్షణ కల్పించనున్నారు. ఎన్.ఏ.శీవ కథనం ప్రకారం, రష్యాలో దాదాపు 5 లక్షల మంది పాక్షిక నైపుణ్యం ఉన్న కార్మికులకు డిమాండ్ ఉంది. మొత్తం మీద 30 లక్షల మంది నిపుణుల కొరతను ఆ దేశం ఎదుర్కొంటోందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల వ్యాఖ్యానించారు. భారతదేశంలోని యువత, నైపుణ్యం గల శ్రామిక శక్తి ఈ లోటును తీర్చగలదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల, రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో వీధులు శుభ్రం చేసే పనిలో ఓ భారతీయ సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌తో సహా 17 మంది కార్మికులు ఉన్నట్లు రష్యన్ మీడియా 'ఫొంటాంకా' నివేదించడం గమనార్హం. మున్సిపల్, ఇతర సేవా రంగాల్లో కార్మికుల అవసరం పెరగడంతో రష్యా.. భారత్ వంటి మిత్రదేశాల నుంచి నియామకాలు చేపట్టేందుకు ఆసక్తి చూపుతోంది.

## అమెరికాలో సన్ ఫార్మా, సిప్లా మందుల రీకాల్... కారణం ఇదే!


దేశీయ ఫార్మా దిగ్గజాలైన సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్, సిప్లా అమెరికా మార్కెట్ నుంచి తమ ఉత్పత్తులను రీకాల్ చేస్తున్నాయి. తయారీలో తలెత్తిన లోపాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఖూఖీణూ) తన తాజా నివేదికలో వెల్లడించింది. వివరాల్లోకి వెళితే, సన్ ఫార్మాకు చెందిన అమెరికా విభాగం.. చుండ్రు, చర్మ సంబంధిత సమస్యలకు వాడే ఫ్లూసినోలోన్ ఎసిటోనైడ్ టాపికల్ సొల్యూషన్ మందుకు చెందిన 26,000కు పైగా బాటిళ్లను వెనక్కి పిలిపిస్తోంది. ఈ మందులో కల్మషాలు, నాణ్యతా ప్రమాణాలు నిర్దేశిత స్థాయికి మించి ఉన్నట్లు యూఎస్ఎఫ్‌డీఏ గుర్తించింది. దీనిని క్లాస్ ××× రీకాల్‌గా వర్గీకరించింది. ఇలాంటి రీకాల్స్ వల్ల ఆరోగ్యానికి తీవ్రమైన హాని ఉండదని రెగ్యులేటరీ సంస్థ పేర్కొంది. దీంతో పాటు, మొటిమల చికిత్సలో వాడే క్లిండామైసిన్ ఫాస్ఫేట్ యూఎస్‌పీ మందును కూడా ఇదే కారణంతో సన్ ఫార్మా రీకాల్



చేస్తోంది.

మరోవైపు, సిప్లా కంపెనీకి చెందిన అమెరికా విభాగం లాన్‌రియోటైడ్ ఇంజెక్షన్‌కు చెందిన 15,000కు పైగా ప్రీ–ఫిల్డ్ సిరంజీలను రీకాల్ చేస్తోంది. ఈ మందులో చిన్న చిన్న రేణువులు కనిపించడమే ఇందుకు కారణం. దీనిని క్లాస్ ×× రీకాల్‌గా వర్గీకరించారు. ఇలాంటి మందుల వాడకం వల్ల తాత్కాలిక లేదా సరిదిద్దగలిగే ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అయితే తీవ్రమైన ప్రమాదం ఉండకపోవచ్చని యూఎస్ఎఫ్‌డీఏ తెలిపింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా మార్కెట్ అయిన అమెరికాలో కార్యకలాపాలు నిర్వహించే కంపెనీలకు నాణ్యతా ప్రమాణాలు పాటించడం అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో భారత కంపెనీలు తమ ఉత్పత్తులను రీకాల్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## భిన్నత్వంలో ఏకత్వం..



భారతదేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్న వేళ, ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి తన ప్రత్యేకమైన తలపాగాతో అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో దేశంలోని ఏదో ఒక ప్రాంత సంస్కృతిని ప్రతిబింబించేలా తలపాగా ధరించడం మోదీకి అలవాటు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఈసారి రాజస్థానీ శైలిని పోలిన తలపాగాలో కనిపించారు. ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించిన ప్రధాని మోదీ, ఎరుపు రంగు టై–డై వస్త్రంపై బంగారు జరీ వర్క్‌తో కూడిన తలపాగాను ధరించారు. సిల్క్ బ్రోకేడ్ వస్త్రంతో తయారు చేసిన ఈ తలపాగా రాజస్థానీ హస్తకళా నైపుణ్యాన్ని గుర్తుకు తెచ్చింది. దీనికి మ్యాచింగ్‌గా నీలం, తెలుపు రంగుల కుర్తా–పైజామా, లేత నీలం రంగు జాకెట్‌ను ధరించారు. ప్రధాని మోదీ 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచి గణతంత్ర దినోత్సవాల్లో విభిన్నమైన తలపాగాలు ధరించడం ఒక సంప్రదాయంగా మారింది. ఇవి కేవలం ఫ్యాషన్ కోసం కాకుండా, భారతదేశంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తారు. గతేడాది 76వ గణతంత్ర దినోత్సవం నాడు రాజస్థాన్, గుజరాత్‌లలో ప్రసిద్ధి చెందిన ఎరుపు, పసుపు రంగుల బాంధేజ్ తలపాగాను ధరించారు. గతంలో ఉత్తరాఖండ్ టోపీ, బహుళవర్ణ బాంధనీ ప్రింట్లు వంటివి ధరించి వివిధ రాష్ట్రాల సంస్కృతులకు గౌరవమిచ్చారు. జాతీయ యుద్ధ స్మారకం వద్ద నివాళులర్పించిన అనంతరం, ప్రధాని కర్తవ్య పథ్‌లో జరిగే పరేడ్‌ను వీక్షించడానికి చేరుకున్నారు. జాతీయ గీతం వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా "వందేమాతరం – 150 ఏళ్లు" అనే థీమ్‌తో ఈ ఏడాది వేడుకలను నిర్వహిస్తున్నారు.

## భారత్ తో ట్రేడ్ డీల్ కు ఆ ముగ్గురూ అడ్డుపడ్డారు..



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. అధ్యక్షుడు ట్రంప్ తో పాటు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అధ్యక్షుడి సలహాదారు పీటర్ నవారోపై టెక్సాస్ సెనేటర్ టెడ్ క్రూజ్ సంచలన ఆరోపణలు చేశారు. భారత్ తో ట్రేడ్ డీల్ కు ఈ ముగ్గురూ అడ్డుపడ్డారని క్రూజ్ విమర్శించారు. టారిఫ్ లు వద్దన్నందుకు ట్రంప్ తనపై అరిచాడని, ఓ అసభ్యకరమైన పదం ఉపయోగించాడని చెప్పారు. ఈ మేరకు గతేడాది జరిగిన డోనార్ మీటింగ్ లో ప్రైవేటు దాతలతో మాట్లాడుతూ క్రూజ్ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన దాదాపు పది నిమిషాల ఈ ఆడియో రికార్డ్ ను ఆక్సియోస్ సంస్థ వెలుగులోకి తెచ్చింది.

**టెడ్ క్రూజ్ ఇంకా ఏంచెప్పారంటే..**

ట్రంప్ సొంతపార్టీ నేత టెడ్ క్రూజ్ దాతలతో మాట్లాడుతూ.. భారత్ తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని తాను శ్వేతసౌధంతో నిరంతరం పోరాటం చేస్తున్నానని చెప్పారు. అయితే ఈ ఒప్పందానికి పరిపాలన విభాగంలో ఎవరు అడ్డుపడుతున్నారని ఓ దాత ప్రశ్నించారు. దీనికి క్రూజ్ జవాబిస్తూ.. పీటర్ నవారో, జేడీ వాన్స్, కొన్ని సందర్భాల్లో స్వయంగా డొనాల్డ్ ట్రంపే ఈ ప్రక్రియను నిలిపి వేస్తున్నారని చెప్పారు. గతేడాది ఏప్రిల్ లో ఓ అర్ధరాత్రి పూట తాను ట్రంప్ కు ఫోన్ చేశానని, టారిఫ్ లు విధించే ఆలోచన మానుకోవాలని సూచించానని క్రూజ్ చెప్పారు. సుంకాల వల్ల ఆర్థిక వ్యవస్థపై చెడు ప్రభావం పడుతుందని, ఇప్పటికే మార్కెట్లో పలు వస్తుసేవల ధరలు 10 శాతం నుంచి 20 శాతం వరకు పెరిగాయని చెప్పానన్నారు. ఈ ప్రభావంతో రాబోయే రోజుల్లో సెనేట్ పై, హౌస్ పై పట్టుకోల్పోతారని హెచ్చరించినట్లు తెలిపారు. అయితే, ట్రంప్ అప్పుడు తనపై అరిచారని క్రూజ్ వివరించారు. ఈ విషయంపై తన సిబ్బందితో జోక్ చేశానని, ట్రంప్ ఉపయోగించిన ఓ అసభ్య పదం మీలో ఎవరైనా ఉపయోగించి ఉంటే అప్పటికప్పుడు మిమ్మల్ని తొలగించేవాడినని చెప్పానన్నారు.

## తగ్గనున్న కార్ల ధరలు!



విజయవంతమైన భారత్... ప్రపంచాన్ని మరింత స్థిరంగా, సుసంపన్నంగా, సురక్షితంగా మారుస్తుందని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ అన్నారు. భారత్ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె, భారత్‌తో చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం ఖరారు కానున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన ఆమె, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో కలిసి 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. రేపు ప్రధాని మోదీతో జరగనున్న శిఖరాగ్ర సమావేశంలో భారత్, 27 దేశాల యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ ఒప్పందాన్ని "అన్ని ఒప్పందాలకూ తల్లిలాంటిది" (ఎశ్రీష్టవతీ శీట ఖశ్రీశ్రీ ఎముశ్రీం) అని, "చరిత్రాత్మక ఒప్పందం" అని ఉర్సులా గతంలో అభివర్ణించారు. ఈ ఒప్పందం ద్వారా దాదాపు 200 కోట్ల జనాభాతో కూడిన అతిపెద్ద మార్కెట్ ఏర్పడుతుందని, ఇది ప్రపంచ జీడీపీలో దాదాపు నాలుగో వంతు అని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం యూరోపియన్ యూనియన్... భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇరుపక్షాల మధ్య వస్తు వాణిజ్యం 135 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈ వాణిజ్య ఒప్పందం కోసం 2007లో చర్చలు ప్రారంభమైనా, 2013లో నిలిచిపోయాయి. 2022లో ఈ చర్చలను తిరిగి ప్రారంభించారు. ఈ ఒప్పందంలో భాగంగా యూరప్ నుంచి దిగుమతి అయ్యే కార్లపై సుంకాలను భారీగా తగ్గించడానికి భారత్ అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 110శాతం వరకు ఉన్న పన్నును తొలుత 40 శాతానికి, ఆ తర్వాత దశలవారీగా 10 శాతానికి తగ్గించనున్నట్లు సమాచారం. ఇది వోక్స్‌వ్యాగన్, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ వంటి లగ్జరీ కార్ల కంపెనీలకు భారత మార్కెట్‌లో ప్రవేశాన్ని మరింత సులభతరం చేస్తుంది. దీంతో భవిష్యత్తులో యూరప్ కార్ల ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

# కదులుతున్న సింగరేణి డొంక

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో సింగరేణి బొగ్గు గనుల కేటాయింపు వ్యవహారం ఇప్పుడు ఒక పెద్ద కుదుపుకు కారణమైంది. తెలంగాణ రాజకీయాల్లో సింగరేణి కాలరీస్ చుట్టూ ముసురుకున్న అవినీతి ఆరోపణలు పెను దుమారం రేపుతున్నాయి. సింగరేణిలో జరుగుతున్న టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఈ మొత్తం వ్యవహారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూత్రధారి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంలో ప్రధానంగా 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే కొత్త నిబంధనను హరీశ్ రావు ఎండగట్టారు. గతంలో లేని విధంగా, కేవలం తమకు కావలసిన కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టేందుకే ఈ నిబంధనను తెరపైకి తెచ్చారని ఆయన ఆరోపించారు. జనవరి 2025లో భూపాలపల్లి పనుల కోసం జారీ చేసిన టెండర్లలో ఎలాంటి సైట్ విజిట్ నిబంధన లేదని, అప్పుడు అంచనా వ్యయం కంటే 7 శాతం తక్కువకే టెండర్లు ఖరారయ్యాయని ఆయన గుర్తు చేశారు. మూడు నెలల వ్యవధిలోనే, అంటే మే 2025లో నిబంధనలను మార్చి కొత్త టెండర్లు జారీ చేయడంలోని అంతరార్థం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ మార్పుల వల్ల పోటీ తగ్గి, సీఎం రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డికి చెందిన 'శోధా కన్‌స్ట్రక్షన్స్' లబ్ధి పొందిందని హరీశ్ రావు స్పష్టం చేశారు. నైనీ బ్లాక్ టెండర్లను ప్రభుత్వం రద్దు చేయడమే అక్కడ అక్రమాలు జరిగాయనడానికి నిలువెత్తు నిదర్శనమని హరీశ్ రావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితులైన వారికే కాంట్రాక్టులు దక్కేలా నిబంధనలను తుంగలో తొక్కారని విమర్శించారు. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన మూడు ప్రధాన అంశాలను ఆయన లేవనెత్తారు. ఈ కుంభకోణానికి బాధ్యులు ఎవరు?, దీని వల్ల సింగరేణికి, ప్రభుత్వానికి జరిగిన నష్టం ఎంత?, ఈ వ్యవహారంలో వ్యక్తిగతంగా లబ్ధి పొందిన వారెవరు? లాంటి అంశాలు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ నిర్వహణ బాధ్యతలను ఒక ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు, చివరకు విచారణ డిమాండ్ల దాకా వెళ్లాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఈ అంశంపై మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ఒడిశాలో సింగరేణికి కేటాయించిన నైని బొగ్గు గని తవ్వకాల కోసం పిలిచిన టెండర్లలో నిబంధనలను ఒకరికి అనుకూలంగా మార్చారనేది ప్రధాన ఆరోపణ. ముఖ్యంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఒక ప్రముఖ మీడియా సంస్థ అధిపతి అల్లుడికి చెందిన సంస్థకు ఈ కాంట్రాక్ట్ దక్కేలా చేస్తున్నారని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. 'సైట్ విజిట్' నిబంధనను సాకుగా చూపి అర్హత ఉన్న సంస్థలను తప్పించారని విపక్షాలు ఆరోపించాయి.ఈ ఆరోపణలు వెల్లువెత్తిన వెంటనే అప్రమత్తమైన భట్టి విక్రమార్క, ప్రభుత్వంపై ఎటువంటి మచ్చ



పడకూడదనే ఉద్దేశంతో ఆ టెండర్లను రద్దు చేస్తున్నట్లు సంచలన ప్రకటన చేశారు. తాజాగా మీడియా ముందుకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బీఆర్ఎస్ విమర్శలపై ధీటుగా స్పందించారు. కేవలం తాజా టెండర్లే కాకుండా, 2014 నుంచి సింగరేణిలో జరిగిన బొగ్గు గనుల కేటాయింపులన్నింటిపై విచారణ జరిపించేందుకు తాము సిద్ధమని ప్రకటించారు. "దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాయాల్సిన అవసరం లేదు. మాకు లేఖ రాస్తే చాలు, గత పదేళ్లలో జరిగిన ప్రతి వ్యవహారంపై సమగ్ర విచారణ చేయిస్తాం" అని భట్టి సవాల్ విసిరారు. ఈ వివాదంలో ప్రధానంగా వినిపిస్తున్న పేరు సృజన్ రెడ్డి. ఆయనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధం ఉందని బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను భట్టి తీవ్రంగా ఖండించారు. సృజన్ రెడ్డికి, రేవంత్ రెడ్డికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ, అసలు వాస్తవాలను బయటపెట్టారు. సృజన్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అల్లుడని భట్టి వెల్లడించారు. ఆయన ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నారని, సొంత పార్టీ నేత అల్లుడిపైనే బీఆర్ఎస్ బురద జల్లడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. టెండర్లలో అక్రమాలకు తావిచ్చేలా ఉన్న 'సైట్ విజిట్' నిబంధనపై భట్టి క్లారిటీ ఇచ్చారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదని భట్టి పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాం నుంచే ఈ నిబంధన అమల్లో ఉందని, గతంలో జరిగిన కేటాయింపుల్లోనూ ఇదే పద్ధతి అనుసరించారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణి బొగ్గు గనుల వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక టెండర్ రద్దుతో ముగిసిపోయేలా కనిపించడం లేదు. 2014 నుంచి జరిగిన కేటాయింపులపై విచారణకు ప్రభుత్వం సిద్ధమనడం ద్వారా బంతిని ఇప్పుడు బీఆర్ఎస్ కోర్టులోకి నెట్టింది. ఒకవేళ విచారణ జరిగితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందాలలోని లోపాలు కూడా బయటపడే అవకాశం ఉంది. మొత్తానికి, సింగరేణి బొగ్గు గనుల సెగ తెలంగాణ రాజకీయాలను మరింత వేడెక్కించబోతోంది. కేవలం టెండర్ల అక్రమాలే కాకుండా, సింగరేణి కార్మికులకు చెల్లించాల్సిన బోనస్ విషయంలో కూడా ప్రభుత్వం మోసానికి పాల్పడిందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సింగరేణికి సుమారు రూ. 6,900 కోట్ల లాభాలు వచ్చినప్పటికీ, ఆ లెక్కలను ప్రభుత్వం దాచిపెట్టిందని ఆరోపించారు. లాభాలను తక్కువ చేసి చూపడం ద్వారా కార్మికులకు దక్కాల్సిన బోనస్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం తగ్గించిందని ఆయన విమర్శించారు. సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం, ఇంత పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నా ఎందుకు మౌనంగా ఉందని ఆయన ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలు ఒకరికొకరు సహకరించుకుంటూ సింగరేణిని ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు వెంటనే స్పందించాలని, అప్పుడే నిజానిజాలు బయటకు వస్తాయని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసలు విషయాలను పక్కన పెట్టి, సంబంధం లేని పత్రాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' పేరుతో జారీ చేసిన అన్ని టెండర్లను రద్దు చేయాలని, తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని ఆయన పట్టుబట్టారు. ఈ ఆరోపణలతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

# ఇక తగ్గనున్న రిజిస్ట్రేషన్ కష్టాలు

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం వాహన రిజిస్ట్రేషన్ విధానంలో కొత్త పద్ధతి అమలులోకి తెచ్చింది. ఇటు వాహనదారులకు, అటు రవాణా అధికారులకు ఇద్దరికీ మేలు జరిగేలా నూతన విధానం నుంచి అమలులోకి వచ్చింది. వాహనం కొన్న చోటే రిజిస్ట్రేషన్ చేసే విధానం ప్రవేశపెట్టింది. మాదాపూర్ రవాణా కార్యాలయంలో నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. దీంతో రాష్ట్రమంతా అమలులోకి తెచ్చింది. కొత్త వాహనాలు కొనుగోలు చేస్తే ఇకపై ఆర్డీవో కార్యాలయాల్లో క్యూలు, చక్కరలు అవసరం లేదు. డీలర్లు ఫొటోలు, డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో సమర్పించి నంబర్ కేటాయిస్తారు. డీలర్లు ఇన్‌వాయిస్, బీమా, చిరునామా ధ్రువీకరణ, వాహన చిత్రాలు అప్‌లోడ్ చేస్తారు. అధికారులు డిజిటల్ పరిశీలన తర్వాత ఆమోదం ఇస్తారు. ఆర్సీ కార్డు చిరునామాకు పోస్ట్ అవుతుంది. అవసరమైతే షోరూమ్‌లో తనిఖీ జరుగుతుంది. అయితే కొత్త విధానం ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు మాత్రమే. వాణిజ్య వాహనాలు ఆర్డీవోలోనే చేసుకోవాలి. ఆర్టీవోలో స్లాట్ బుకింగ్, వేచి ఉండటం ముగిసిపోతుంది. కొనుగోలు రోజు సాయంత్రానికి రిజిస్ట్రేషన్ పూర్తి. పట్టణ ప్రజలకు మార్గదర్శకం. డిజిటల్ పారదర్శకత పెరుగుతుంది, అక్రమాలు, బ్రోకర్ వ్యవస్థ తగ్గుతుంది. ఈ వ్యవస్థ వాహన డీలర్లను బలోపేతం చేస్తుంది. వినియోగదారుల అనుభవం మెరుగవుతుంది. రాష్ట్రవ్యాప్త అమలుతో ట్రాఫిక్, కార్యాచరణ సమస్యలు తగ్గుతాయి. తెలంగాణ సంయుక్త రవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ వాహనాల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన నూతన విధానాన్ని ప్రారంభించారు. ఈ విధానం వల్ల వినియోగదారులకు సమయం ఆదా అవుతుంది. రిజిస్ట్రేషన్ కోసం రవాణా కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. వాహనం అమ్మిన డీలర్ శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం ఆన్లైన్ లో దరఖాస్తు చేస్తారు. రవాణా శాఖ అధికారులు



ఆన్లైన్లో పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు. ఉదయం వాహనం కొనుగోలు చేస్తే.. సాయంత్రానికి శాశ్వత రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఒకవేళ ఆ వాహనాన్ని సాయంత్రం కొనుగోలు చేస్తే.. రిజిస్ట్రేషన్ మాత్రం మరుసటి రోజు పూర్తవుతుంది. ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ కోసం ఇన్ వాయిస్, ఫారం 21, ఫారం 22, ఇన్సూరెన్స్, అడ్రస్ ప్రూఫ్, వెహికల్ ఫోటోలను డీలర్ ఆన్లైన్లో అప్లోడ్ చేస్తాడు. రవాణా శాఖ అధికారి ఆ దరఖాస్తు మొత్తాన్ని పరిశీలించి.. రిజిస్ట్రేషన్ నెంబర్ కేటాయిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి అయిన తర్వాత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ స్పీడ్ పోస్ట్ ద్వారా వాహనాన్ని కొనుగోలు చేసిన వ్యక్తికి వెళుంది. శాశ్వత రిజిస్ట్రేషన్లకు సంబంధించి అవసరమైతే వాహనాలను తనిఖీ చేస్తామని.. డీలర్ల షోరూంలోకి వెళ్లి వాహనాలను పరిశీలిస్తామని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విధానం కేవలం బైక్, కార్లకు మాత్రమే వర్తిస్తుంది. కమర్షియల్ వెహికల్స్ రిజిస్ట్రేషన్ యధావిధిగా ఆర్టీవో కార్యాలయాలలోనే జరుగుతూ ఉంటుంది.

## మళ్లీ విధుల్లోకి...

**మహబూబ్ నగర్**

తెలంగాణ ఉద్యాన శాఖలో గత ఐదేళ్లుగా అన్యాయానికి గురైన 175 మంది ఉద్యాన విస్తరణాధికారులను తిరిగి విధుల్లోకి తీసుకోవడంపై హర్షం వ్యక్తమవుతోంది. 2020లో కరోనా సాకుతో గత ప్రభుత్వం వీరిని తొలగించగా.. అప్పటి నుండి వీరు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నికల హామీని నిలబెట్టుకుంటూ ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమను తిరిగి నియమించడం పట్ల అధికారుల సంఘం నాయకులు విశ్వనాథ రెడ్డి, సంధ్యా జోషి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యానవన శాఖలో గత ఐదేళ్లుగా అన్యాయానికి గురైన 175 మంది ఉద్యాన విస్తరణాధికారులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత ప్రభుత్వం 2020 మే నెలలో కరోనా సాకుతో బడ్జెట్ భారం పేరు చెప్పి వీరిని విధుల నుంచి తొలగించింది. అప్పటి నుండి వీరు ఆర్థిక ఇబ్బందులతో పోరాడుతూ.. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పాలకుల చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదు. అయితే, తాజాగా రేవంత్ రెడ్డి సర్కార్ వీరిని తిరిగి నియమిస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఆ కుటుంబాల్లో వెలుగులు నిండాయి. తమకు ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకున్నందుకు ఉద్యాన విస్తరణాధికారుల సంఘం ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డిని కలిసిన సంఘం నాయకులు విశ్వనాథ రెడ్డి, సెక్రటరీ సంధ్యా జోషి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. 175 కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రికి తాము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు. ఈ అధికారులు ఇకపై క్షేత్రస్థాయిలో రైతులకు. ప్రభుత్వానికి మధ్య ఒక బలమైన వారధిగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యాన శాఖ అమలు చేసే ప్రతి పథకాన్ని రైతుల చెంతకు చేర్చడంలో తమ వంతు పాత్ర పోషిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ సానుకూల నిర్ణయం ఇతర ఒప్పంద ఉద్యోగుల్లో కూడా ఆశలు చిగురింపజేసింది.

## గ్లోబల్ స్కిల్‌హబ్‌గా తెలంగాణ

-మొదటిపేజీ తరువాయి

నెలకొంది. అనంతరం సైనికుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అమర జవాన్లకు గవర్నర్, సైనికాధికారులు నివాళులర్పించారు. ఈ వేడుకల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డిలు పాల్గొన్నారు. గణతంత్ర వేడుకల దృష్ట్యా పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన గవర్నర్, ప్రజా ప్రభుత్వం ఇటీవలే తెలంగాణ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని పేర్కొన్నారు. హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేలా తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ ఉందన్న ఆయన, రాష్ట్రాన్ని మూడు ఎకానమీ జోన్లుగా విభజించారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ స్కిల్ హబ్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంచేందుకు తెలంగాణ సర్కారు కృషి చేస్తుందన్నారు. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చామని, ప్రజా ప్రభుత్వం ఇప్పటి వరకు 62 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని వివరించారు. భూ వివాదాలు పరిష్కరించే విధంగా భూభారతి చట్టం తెచ్చినట్లుగా గవర్నర్ వివరించారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు. సన్నవడ్లపై క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్‌ను చెల్లిస్తున్నామన్నారు. 26 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు గుర్తు చేశారు. గతేడాది నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు గిన్నిస్ బుక్‌లో చోటు దక్కిందని పేర్కొన్నారు. రైతులకు 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్న గవర్నర్, మేడారం అభివృద్ధి కోసం రూ.251 కోట్లు కేటాయించామన్నారు.

**విద్య, వైద్యం ప్రాధాన్యతలుగా :** ప్రతి నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లుగా పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నారని చెప్పారు. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. 27 ఎకరాల్లో రూ.2 వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామన్న ఆయన, విద్య, వైద్యాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యతలుగా తీసుకుందని జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. విద్యార్థులకు సమాన అవకాశాల కోసమే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామన్నారు. మహిళలు ఇప్పటికే రూ.200 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు చేశారని గవర్నర్ తెలిపారు. మహిళలను పెట్రోల్‌బంక్‌లు, ఆర్టీసీ అద్దె బస్సులకు యజమానులుగా చేశామన్నారు. బ్యాంక్ రుణాల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు కార్యాచరణ చేపట్టామని వెల్లడించారు.

"మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా తెలంగాణ సాగుతోంది. ప్రజాప్రభుత్వం ఇటీవలే రైజింగ్ తెలంగాణ డాక్యుమెంట్ ఆవిష్కరించింది. రైజింగ్ తెలంగాణ–2047లో సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుంది. హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేలా తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ ఉంది. మూడు కీలక రంగాలకు ప్రత్యేకమైన 3 జోన్లను ఏర్పాటు చేస్తోంది"– జిష్ణుదేవ్ వర్మ, గవర్నర్

**హ్యామ్ విధానంలో రోడ్ల అభివృద్ధి**

7,450 కి.మీ పంచాయతీ రోడ్లను ప్రభుత్వం అభివృద్ధి చేయనుందని జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. తొలిదశలో రోడ్ల కోసం రూ. కోసం రూ.11,399 కోట్లు కేటాయించామన్నారు. హ్యామ్ విధానంలో 12 వేల కి.మీ. రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లుగా వెల్లడించారు. నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లుగా వివరించారు. హిల్ట్ పాలసీ ద్వారా కాలుష్య పరిశ్రమలను సిటీ వెలుపలకు తరలించనున్నట్లుగా తెలిపారు. చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. 27 ఎకరాల్లో రూ.2 వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నట్లుగా గవర్నర్ వివరించారు.

## హైదరాబాద్‌లో చిన్నారి ప్రాణాలు తీసిన చైనా మాంజా

-మొదటిపేజీ తరువాయి

కుమార్తెలు ద్విచక్ర వాహనంపై కూకట్‌పల్లికి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. వివేకానందనగర్ హైవే వద్ద చైనా మాంజా బాలిక నిష్విక మెడకు చుట్టుకుంది. దాంతో ఆమె కిందపడిపోయింది. తీవ్ర గాయం కావడంతో బాలిక అక్కడకక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చైనా మాంజా సాధారణ నూలు దారం కాదు. ఇది నైలాన్ లేదా సింథటిక్ పదార్థంతో తయారవుతుంది. దానిపై గాజు ముక్కల పొడిని పూస్తారు. ఈ దారం పక్షుల రెక్కలను, మనుషుల నరాలను కోసేంత ప్రమాదకరంగా ఉంటుంది. ఇది తెగిపోయి ఎక్కడైనా చిక్కుకుంటే ప్రాణాంతకంగా మారుతుంది. తెలంగాణ ప్రభుత్వం చైనా మాంజా అమ్మకాలపై నిషేధం విధించినప్పటికీ, కొందరు రహస్యంగా విక్రయిస్తున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లపై భారీ గుడ్‌న్యూస్



-మొదటిపేజీ తరువాయి

మంజూరు చేయనున్నారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకంపై మరో కీలక అప్డేట్ ఇచ్చారు.

**వారికి ఉచితంగా స్థలం, ఇళ్లు**

ఇందిరమ్మ ఇళ్ల పథకంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరో శుభవార్త అందించారు. త్వరలోనే పట్టణాల్లో ఉండే పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ప్రభుత్వమే ఇంటి స్థలం కేటాయించి నిర్మాణానికి నిధులు అందిస్తుందని తెలిపారు. త్వరలోనే ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు. జనవరి 26న మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని రైతులకు సబ్సిడీ కింద ఆయన యంత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే మూడు నెలల్లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలను పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. మిగతా ఇళ్ల నిర్మాణం కూడా శరవేగంగా జరుగుతుందని, వాటిని కూడా వీలైనంత త్వరగా ప్రారంభిస్తామన్నారు.

**72 గజాల స్థలం కేటాయింపు**

పట్టణ ప్రాంతాల్లోని పేదలకు త్వరలో ఉచితంగా 72 గజాల స్థలం కేటాయిస్తామన్నారు. ఆ స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని పొంగులేటి తెలిపారు. పట్టణాల్లో ఇళ్లు కట్టుకోవడానికి చాలామందికి సొంత స్థలాలు లేవు. వారికి ప్రభుత్వం 72 గజాల స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వనుంది. ఇప్పటికే అధికారులు ఇందుకోసం ప్రభుత్వ స్థలాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

**వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీ**

రైతులకు వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీ అందిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతులకు ఉపయోగపడే యంత్రాలు, పరికరాలపై రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల రైతులపై భారం తగ్గుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే రైతులకు ఈ పథకం అమలవుతోందన్నారు. రైతులు దీనిని ఉపయోగించుకోవాలని కోరారు. అటు ఇటీవల సన్నబియ్యం పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ అందించినట్లు స్పష్టం చేశారు. ఇక రైతు భరోసా పథకం నిధులు త్వరలోనే విడుదల చేస్తామని పేర్కొన్నారు

# 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.




**సామాన్యుడి అస్త్రం దేవీపట్నం.** దేవీపట్నం మండలం ఇందుకూరుపేట పంచాయితీ కార్యాలయం లో మరియు హై స్కూల్ నందు ఘనం గా 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం 1947 ఆగస్టు 15న స్వతంత్రం వస్తే ప్రతి సంవత్సరం ఆగస్టు 15న స్వతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకుంటామని, మరి జనవరి 26న గణతంత్ర దినోత్సవం జరుపుకోవాలనే అవసరం , ఆనాడు స్వతంత్రం వచ్చిన తర్వాత మన దేశానికి దేశాదినేతగా బ్రిటిష్ అధికారి లార్డ్ మౌంట్ బాటిల్ ఉండేవారని, అప్పుడు రాజ్యాంగపరమైన పరిపాలన లేదని, అందువలన ఒక కమిటి ఏర్పడి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని రచించ టానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టిందని దానిని పూర్తిస్థాయిలో అమలు పరచటానికి 1950 జనవరి 26న రాజ్యాంగాన్ని అమలుపరిచిన రోజని దానిని రిపబ్లిక్ డే గా , గణతంత్ర దినోత్సవం గా జరుపుకోవాలని ఆమోదించిన రోజుని అందుకే ఈరోజు భారతదేశ వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని ఈ రాజ్యాంగాన్ని రహించిన అంబేద్కర్ లాంటి మహానుభావులు ఎందరో ఈ దేశ స్వతంత్రం కోసం ప్రాణ త్యాగాలు చేశారని వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈఓ త్రిమూర్తులు, పంచాయతీ కార్యదర్శి సురేష్,ప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు,మాజీ రాష్ట్ర పార్టీ కార్యదర్శి చావలం శివరామకృష్ణ, సీనియర్ నాయకులు రేలంగి రాంబాబు,ఐ టి డి పి అధ్యక్షులు మద్దేటి అంజిరెడ్డి, ఐ టి డి పి కార్యదర్శి తాళ్లూరు కుటుంబరెడ్డి, జడ్పీహెచ్ స్కూల్ కమిటీ చైర్మన్ రామకృష్ణ, బిజెపి ప్రధాన కార్యదర్శి అయినాల వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు కొత్తపల్లి సత్యనారాయణ, జనసేన పార్టీ కార్యదర్శి దొరబాబు, జనసేన సీనియర్ నాయకులు కట్టమూరు వీరబాబు, మీడియా కోఆర్డినేటర్ దుర్గ ప్రసాద్, మట్ట సందీప్, భద్రం, సురేష్, మరియు ఎంపీడీవో సిబ్బంది సచివాలయ సిబ్బంది హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## మీ భద్రత మా బాధ్యత

షాద్ నగర్ జోన్ డీసీపీ శిరీష..

డ్రగ్స్ నిర్మూలనపై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తాం..."

77 వ గణతంత్ర దినోత్సవాల లో పాల్గొన్న డీసీపీ శిరీష..



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ డ్రగ్స్ నిర్మూలనపై ప్రజలలో మరింత అవగాహన కల్పిస్తామని షాద్ నగర్ జోన్ డిసిపి శిరీష అన్నారు.. సోమవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని షాద్ నగర్ మున్సిపాలిటీలోనీ ఏసిపి కార్యాలయంలో జరిగిన జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా ఏసీపీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జాతీయ పథకాన్ని ఎగురవేశారు..అనంతరం డిసిపి శిరీష మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం ఎప్పుడు సవాలతో కూడుకున్నదని, శాంతిభద్రతల పర్యవేక్షణకు ఎటువంటి లోపం కలుగుతున్న ఎప్పుడు ముందుంటామని పేర్కొన్నారు.. షాద్ నగర్ జోన్ డీసీపీగా తనని నియమించినందుకు చాలా ఆనందంగా ఉందని,సీనియర్ అధికారుల సూచనల మేరకు నడుచుకోవాల్సిన విధివిధానాలను సిబ్బందికి తెలియజేశామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఏసిపి లక్ష్మీనారాయణ, సీఐ విజయ్ కుమార్, డిఐ వెంకటేశ్వర్లు, ఎస్బి ఎస్ఐ దేవకి, ఎస్సైలు ప్రణయ్, శ్రీకాంత్,ఏసైలు సిబ్బంది పాల్గొన్నారు..

## పాత్రికేయుడు వైద్య వెంకటేష్‌కు ఘన సత్కారం




**సామాన్యుడి అస్త్రం ధర్మపురి :** ప్రముఖ దినపత్రిక ఈనాడులో గత 25 సంవత్సరాలుగా పాత్రికేయుడిగా నిర్విరామంగా సేవలందిస్తూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన పాత్రికేయ మిత్రులు వైద్య వెంకటేష్‌ను వెల్గటూర్ మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పాత్రికేయుడిగా 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రెస్ క్లబ్ సభ్యులు, వైద్య వెంకటేష్ తన సుదీర్ఘ పాత్రికేయ జీవితంలో అనేక సంచలనాత్మక వార్తలు, లోతైన విశ్లేషణాత్మక కథనాలతో పాఠకుల మన్ననలు పొందారని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ సమస్యలు, రైతుల కష్టాలు, ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన చేసిన కథనాలు ప్రభుత్వ యంత్రాంగాన్ని స్పందించేలా చేశాయని జవాబుదారీతనం పెంపొందించడంలో పాత్రికేయుల నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. నిజాయితీ, నిర్భయత, నిష్పక్షపాతత్వం ఆయన రచనలకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచాయని అన్నారు. పాత్రికేయుడిగా 25 ఏళ్ల సేవలు పూర్తి చేసుకున్న వెంకటేష్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని, మరెన్నో ప్రజాహిత కథనాలతో సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి, మండలంలోని వివిధ దినపత్రికలకు చెందిన పాత్రికేయులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొని వెంకటేష్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## స్వాతంత్ర్య ఫల్లాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం గణతంత్ర వేడుకలో

:దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి



**సామాన్యుడి అస్త్రం అల్లూరి** ;అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం దారేలా పంచాయతీ కేంద్రంలో దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెండా ఎగురా వేసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించి ఘనంగా గణతంత్ర వేడుకలు జరుపుకున్నారు ఈ సందర్భంగా దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి మాట్లాడుతూ ప్రజలకు స్వతంత్ర్య ఫలాలు అందించడమే లక్ష్యమని రాజ్యాంగ విలువలను మరింత బలంగా నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందని అన్నారు జనవరి 26, 1950న భారత రాజ్యాంగం అమల్లోకి రావడంతో భారతదేశం ఒక సంపూర్ణ ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా అవతరించిందని, ప్రతి పౌరుడికి సమాన హక్కులు, న్యాయం, స్వేచ్ఛ కల్పించడమే రాజ్యాంగం యొక్క ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ గారు సహా అనేక మహానుభావుల అంకితభావం వల్లనే నేడు భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఎదిగిందని తెలిపారు దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని, రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ, చట్టాలను పాటిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఐక్యత, క్రమశిక్షణ, దేశభక్తి ఇవే గణతంత్ర దినోత్సవం మనకు ఇచ్చే ప్రధాన సందేశాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ భాస్కర్, టీడీపీ నాయకులు చవిటియ గోపాలం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ పతాక ఆవిష్కరణతో హుకుంపేటలో గణతంత్ర దినోత్సవ శోభ-దేశభక్తి

నినాదాలతో మార్మోగిన హుకుంపేట పంచాయతీ సచివాలయం-సర్పంచ్ వెంకట పూర్ణిమలి



**సామాన్యుడి అస్త్రం హుకుంపేట** :అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం హుకుంపేట పంచాయతీ సచివాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం సర్పంచ్ సమిడీ పూర్ణిమ మరియు పంచాయతీ అభివృద్ధి అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో జాతీయ పర్వదిన వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా సర్పంచ్ పూర్ణిమ, ఎంపీటీసీ కొమ్మ రమ, వైస్ సర్పంచ్ గోవిందు్ల కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతం ఆలపించగా, సచివాలయ ప్రాంగణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా సర్పంచ్ పూర్ణిమ మాట్లాడుతూ, "1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి రావడంతో భారతదేశం సార్వభౌమ, సామ్యవాద, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించింది. 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించినప్పటికీ, 1950 జనవరి 26న అధికారికంగా అమల్లోకి తీసుకువచ్చారు. రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులు, విధులను ప్రతి పౌరుడు గౌరవిస్తూ దేశ అభివృద్ధికి భాగస్వాములవ్వాలి" అని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, సమానత్వం, న్యాయం, సోదరభావం వంటి మూలసూత్రాలను ఆచరణలో పెట్టడం ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమిడీ పూర్ణిమ, హుకుంపేట మండల వైసీపీ అధ్యక్షుడు పాంగి అనిల్, ఎంపీటీసీ కొమ్మ రమ, పంచాయతీ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, వైస్ సర్పంచ్ గోవింద్, వార్డు సభ్యులు నాగబాబు, లక్ష్మణ్, వెంకటేష్, పీసా కమిటీ సభ్యులు నాగమణి, ఈశ్వర్ రావ్, రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నిడదవోలు టీడీపీ కార్యాలయంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**సామాన్యుడి అస్త్రం నిడదవోలు :** తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిడదవోలు పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయ ప్రాంగణంలో నియోజకవర్గ ముఖ్య నేతలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమ్మిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ విరాజిల్లుతోందంటే దానికి మన రాజ్యాంగమే పునాది అని కొనియాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ రాజ్యాంగ విలువలకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వేడుకల అనంతరం పార్టీ కార్యకర్తలకు, స్థానిక ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కోమ్మిన వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, రాష్ట్ర నాగ వంశీయుల డైరెక్టర్ కాళ్ల లక్ష్మణరావు, రాష్ట్ర నాటక డైరెక్టర్ వెలగల శ్రీ దుర్గా అనంతలక్ష్మి, సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

స్వాతంత్ర సమర యోధుల సంతనానికి సన్మానం చేసిన ఎమ్మెల్యే శిరీషాదేవి



**సామాన్యుడి అస్త్రం రంపచోడవరం :** దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకోవటం శుభప్రదం అని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరం ప్రభుత్వజూనియర్ కళాశాల మైదానంలో సోమవారం గణ తంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వ అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న పధకాలపై వివరించారు. అలాగే రంపచోడవరం నియోజకవర్గం వ్యాప్తంగా అమలు చేస్తున్న పనులు, పురోభివృద్ధి పనులపై వివరించారు. అలాగే వివిధ శాఖల వారు ఏర్పాటు చేసిన స్టాల్ లను పరిశీలించారు. పోలీస్ శాఖ వారు నిర్వహించిన పెరేడ్ కార్యక్రమాన్ని వీక్షించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. అలాగే స్వాతంత్ర సమర యోధుల కుటుంబ సభ్యులను సన్మానం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్,ా చైర్మన్ లోతా లక్ష్మణ రావు, ా××జ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, ావీజ వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, మొల్లేరు సొసైటీ చైర్మన్ పాము అర్జున్,సీనియర్ నాయకులు గణజాల తాతారావు కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మగంటి విఠలయ్య గౌడ్ ను పరామర్శించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రైతు కాలనీలో విఠలయ్య గౌడ్ గృహంలో పరామర్శ



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** నందిగామ మండలం వీర్లపల్లి గ్రామానికి చెందిన కోమ్మగంటి విఠలయ్య గౌడ్ ను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న విఠలయ్య గౌడ్ ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వగ్రామ పెద్దలతో కలిసి వచ్చారు. విఠలయ్య గౌడ్ కుమారులు శ్రీహరి గౌడ్, జగన్ గౌడ్, ప్రతాప్ గౌడ్ లతో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడారు. తండ్రి ఆరోగ్యం గురించి వారి నుండి అడిగి తెలుసుకున్నారు. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న విఠలయ్యకు చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. నిత్యం వ్యవసాయం చేస్తూ గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండేవారని అనారోగ్యంతో బాధపడుతున్నందుకు ఈ విషయం తెలుసుకొని ఇంటికి రావడం జరిగిందని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. కాసేపు విఠలయ్య కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే గడిపారు. ఈ కార్యక్రమంలో రైతు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జర్నలిస్టు కెపి, స్థానిక యువ నాయకుడు మురళీమోహన్ అప్పి, కమ్మ సమైక్యవేదిక నాయకుడు నాయకుడు మాకినేని వెంకటరమణ, పాల్గొన్నవారు పాలకొండ శేఖర్ గౌడ్, అన్వర్ పాష, మహబూబ్, మహమూద్, ప్రభాకర్ రెడ్డి, సందీప్, దాసు, రాఘవేందర్ గౌడ్, శ్రీను, కాలనీవాసి నందిగామ మల్లేష్, తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు..

## ముప్వన్నెల రెపరెపలు.. జనగణమన వందనాలు..

ఘనంగా గణతంత్ర దినోత్సవం..

అన్ని కార్యాలయాలలోనూ ఎగిరిన జెండా..

పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి

ఆర్డీవో, తహసిల్దార్, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్ తదితర ప్రభుత్వ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర వేడుకలు



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :**ఎటు చూసినా మురిసిపోతున్న ముప్వన్నెల జెండా రెపరెపలతో.. రోమాలు నిక్క పొడిచే జనగణ మన గీతంతో.. మన దేశానికి, మన భరతమాతకు, స్వాతంత్రం సాధించిన మహనీయులకు జయ జయ ధ్వానాలతో గణతంత్ర దినోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఈ సందర్భంగా ముప్వన్నెల జెండా ఎగురవేసి వందనం చేశారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం లో ఆర్డిఓ సరిత జెండా ఎగురవేయగా, డీసీపీ కార్యాలయంలో డీసీపీ, లక్ష్మీనారాయణ జెండా ఎగురవేశారు. ఆర్డీవో కార్యాలయంలో అధికారి సరిత, అదేవిధంగా పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం, గ్రంథాలయం, వ్యవసాయ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జెండా ఎగరవేశారు. అదేవిధంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో జెండా ఎగురవేయడంతో పాటు చిన్నారులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఆయా శాఖల అధికారులు, వివిధ పార్టీల నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు..

## హిందూ దేవాలయాలపై దాడులు ఆగావా..

ప్రేక్షక పాత్ర వహిస్తున్న పోలీసులు..

తెలంగాణ రాష్ట్రంలో హిందూ దేవాలయాలకు రక్షణ లేదా..

ఎంకనోళ్ల వెంకటేష్ "బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చ కార్యవర్గ సభ్యులు..



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** రాత్రి కిషన్ నగర్ గ్రామంలో పురాత దేవాలయం ,శక్తి వంతమైన అమ్మవారి మైసమ్మ దేవాలయం ముందు ఉన్న గుడిని గుర్తు తెలియని వాహన ధ్వంసం చేసినట్టు తెలిపారు. అది యాదృచ్ఛికంగా జరిగిందా, కావాలనే ధ్వంసం చేశారా పోలీసులు విచారణ జరిపించి నిందితులను సాహిక్షించాలని తెలిపారు. ఈ మధ్య తెలంగాణ రాష్ట్రంలో హిందూ దేవాలయాల పైన జరిగిన సంఘటనలు చూస్తుంటే పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తుంది. ఈ రాష్ట్రంలో హిందువులకు గాని హిందూ దేవాలయాలకు గానీ రక్షణ ఉందా అని ప్రశ్నించారు.. లేని పక్షంలో హిందూ సంఘాలని సంఘటితం చేసి ఈ ప్రభుత్వం పైన నిరసనగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు..

# ఘనంగా 77 వ గణతంత్ర వేడుకలు


**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు స్థానిక తలారిసింగి ప్రభుత్వం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల మైదానంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, జిల్లా పోలీసు దళాల నుండి గౌరవ వందనం స్వీకరించి జిల్లాకు సంబంధించిన వివిధ శాఖలు సాధించిన ప్రగతిని చదివి వినిపించారు. ఆనంతరం స్వాతంత్ర్య సమరయోధుడు గాం గంటం దొర కుటుంబ సభ్యులు రాంబాబు, బాబురావు లను దుస్సాల్వా, పూలమాలతో వారిని సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు . జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా నిర్వహించిన మారుమూల గిరిజన ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా మందుల సరఫరా మరియు జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో పోలీస్ ప్రత్యేక దళాలు నిర్వహించిన ఆపత్కాలంలో ప్రమాదాలు ఎదురైనపుడు ఏ విధముగా ఎదుర్కోవాలో, పోరాడాలో చూపించిన ప్రదర్శన, పోలీస్ డాగ్ రాక్ యొక్క విన్యాసాలు మరియు డాగ్ షో అహూతులను విశేషంగా ఆకట్టుకొన్నాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు చేసిన సంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అలరించాయి. పెదగరువు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమం పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన ప్రదర్శనలో మొదటి బహుమతి గెలుచుకున్నారు. చిల్డ్రన్ హోమ్, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ,పాడేరు విద్యార్థినులు ద్వితీయ స్థానం, హుకుంపేట మండలం గుత్తలపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు తృతీయ స్థానాన్ని సొంతం చేసుకున్నారు. రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్సీ అకాడమీ విద్యార్థులకు ప్రత్యేక అకర్షణగా నిలిచి ప్రశంస అవార్డు ను అందించటం జరిగింది. ఏజెన్సీలోని 10 పాఠశాలల, కళాశాలల,విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పరేడ్ మార్చ్ ఫాస్ట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కేజీబీవీ, హుకుంపేట బాలికల పాఠశాలకు ప్రథమ బహుమతి, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల తలార్ సింగి బాలుర పాఠశాల ద్వితీయ బహుమతి, కేజీబీవీ, డుంబ్రిగుడ బాలికల పాఠశాల మూడవ బహుమతి సొంతం చేసుకున్నారు. అటవీ శాఖ శకటానికి ప్రథమ బహుమతి, వైద్య – ఆరోగ్య శాఖ ఏర్పాటుచేసిన శకటానికి ద్వితీయ బహుమతి లభించింది. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ ఏర్పాటు చేసిన శకటానికి తృతీయ స్థానం లభించింది. అటవీ శాఖ, వ్యవసాయ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, రవాణా శాఖ, గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య శాఖ శకటాలు ఏర్పాటు చేశారు. అగ్నిమాపక శకటాన్ని ప్రదర్శినాలో పాల్గొన్నాయి. స్టాల్స్ ఏర్పాట్లు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలుపై స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, డిఆర్డిఏ విడివికే లపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ – ప్రకృతి వ్యవసాయం ఉద్యానవన శాఖ సంయుక్తంగా , స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ, కాఫీ బోర్డు , గిరిజన సహకార సంస్థ, భూగర్భ మరియు జల వనరులు పరిశ్రమల శాఖ సంయుక్తంగా , ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్, పాఠశాల విద్యా శాఖ, గృహ నిర్మాణ శాఖ స్టాల్స్ ను కూడా ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ – ప్రకృతి వ్యవసాయం ఉద్యానవన శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన స్టాల్ కి ప్రథమ బహుమతి, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ కి ద్వితీయ బహుమతి, కాఫీ బోర్డు స్టాల్ నకు తృ తీయ బహుమతి సొంతం చేసుకున్నాయి. ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు, శకటాలకు,



స్టాల్స్ నకు బహుమతులను సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అమిత్ బర్దార్, ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్,పాడేరు ఐటిడిఏ పివో తిరుమణి శ్రీ పూజ, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, పాడేరు ఇంచార్జ్ డి ఎఫ్ వో కె. ఉమా మహేశ్వరి, ఇంచార్జ్ డిఆర్వో అంబేద్కర్, ఇంచార్జ్ ఆర్ డివో ఎమ్ విఎస్ లోకశ్వరరావు, రాష్ట్ర సాంస్కృతిక, జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు పలు శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**సామాన్యుడి అస్త్రంధర్మపురి :** తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రతిపాదనలతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.21,04,500 విలువ గల చెక్కులను మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ శు క్రవారం పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి చెక్కులను అందజేశారు. అనంతరం రాములు గౌడ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలు, నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని, అత్యవసర వైద్య అవసరాల సమయంలో ఈ నిధి ప్రజలకు వరంగా నిలుస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అనేక కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓరుగల అరుణ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సంధి మల్లారెడ్డి, నాయకులు తోట మల్లేశం, అజ్మీర అంజి నాయక్, తోట రామ్ రెడ్డి, అక్కినపల్లి, నాంపల్లి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## భీంపల్లిగ్రాము పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



**సామాన్యుడి అస్త్ర కమలాపూర్ :** భీంపల్లి గ్రామ సర్పంచ్ వాసాల శ్రీనివాస్, తండ్రి వాసాల దామోదర్, జ్ఞాపకార్థంగా భీంపల్లి,జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో విద్యాపై మరింత ఆసక్తి పెంచేలా జరిగింది. ప్రైవేట్ స్కూల్‌లకు దీటుగా ప్రభుత్వ విద్యార్థుల ఉపన్యాసాలు 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రసంగాలు, ఉపన్యాసాలు గ్రామ ప్రజలను, ఉపాధ్యాయులను అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో మాట్లాడిన సర్పంచ్ వాసాల శ్రీనివాస్, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు ఉన్నాయని, తల్లిదండ్రులు కార్పొరేట్ పాఠశాలలపై ఆధారపడకుండా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని సూచించారు.

## అక్రిడేషన్ కార్డు కి జర్నలిజానికీ ఎటువంటి సంబంధం లేదు

**పత్రికా ఎడిటర్ ఇచ్చిన గుర్తింపు కార్డే ప్రమాణికం**

**ప్రభుత్వాల చేతుల్లో అక్రిడేషన్డ ప్రశ్నించే గొంతులపై అణచివేత**

**ప్రశ్నించే ప్రతి ఒక్కరే నిజమైన జర్నలిస్టులు**

**అఖిల భారతీయ జర్నలిస్టు ప్రొటెక్షన్ ఫోర్స్ చైర్మన్ చుంచు కుమార్ ఘాటైన విమర్శ**




**సామాన్యుడి అస్త్ర కమలాపూర్ :** అక్రిడేషన్ కార్డు లేకపోతే జర్నలిస్టు కాదన్న భావన ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ఆలోచన అని, అది జర్నలిజం ఆత్మకు పూర్తిగా విరుద్ధమని అఖిల భారతీయ జర్నలిస్టు ప్రొటెక్షన్ ఫోర్స్ చైర్మన్ చుంచు కుమార్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. జర్నలిస్టు గుర్తింపు అనేది ప్రభుత్వాలు చేతిలో పెట్టే అక్రిడేషన్ కార్డుతో కాదుడ ప్రజల తరఫున నిలబడే ధైర్యంతో, పత్రిక ఎడిటర్ జారీ చేసే గుర్తింపు కార్డుతోనే నిర్ణయించబడాలని ఆయన స్పష్టం చేశారు. భారత ప్రభుత్వ చట్టాల ప్రకారం గుర్తింపు పొందిన ఏ పత్రికైనా ప్రామాణికమేనని, ఆ పత్రికల్లో పనిచేసే ప్రతి ఒక్కరూ జర్నలిస్టులేనని ఆయన పేర్కొన్నారు. అక్రిడేషన్ కార్డు అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమాల కవరేజ్‌కు ఉపయోగపడే పరిపాలనా సౌకర్యం మాత్రమేనని, జర్నలిస్టు హోదాను కొలిచే కొలమానం కాదని తేల్చి చెప్పారు. అక్రిడేషన్ పేరుతో అణచివేత కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అక్రిడేషన్ కార్డు ఉంటేనే జర్నలిస్టుగా గుర్తించాలంటూ నిబంధనలు విధించడం ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచే చర్యగా ఆయన అభివర్ణించారు. నిజంగా జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యమైతే అలాంటి విధానాలు స్వాగతించదగినవే కానీ, వాస్తవంలో మాత్రం ప్రశ్నించే జర్నలిస్టులను అణిచివేయడానికే ఈ వ్యవస్థను వాడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాలను ప్రశ్నించే వాళ్లనే టార్గెట్ చేస్తూ, అక్రిడేషన్ ఇవ్వకుండా అడ్డుకోవడం, ఇచ్చిన కార్డులను రద్దు చేయడం ద్వారా జర్నలిస్టుల గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వాల చేతుల్లోనే అక్రిడేషన్ చట్టబద్ధంగా నమోదై, ప్రభుత్వ గుర్తింపు పొందిన పత్రికలకు కూడా అక్రిడేషన్ ఇవ్వాలా వద్దా అన్న నిర్ణయం పూర్తిగా ప్రభుత్వాల చేతుల్లోనే ఉండటం వల్ల అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నాయని అన్నారు. అక్రిడేషన్ కార్డులను ఆయుధాలుగా మార్చి, వాటి ఆధారంగా జర్నలిస్టులను ప్రశ్నించడం, వేధించడం తీవ్రంగా ఖండనీయమని స్పష్టం చేశారు. అక్రిడేషన్ వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాల్సినదే తప్ప, ప్రశ్నించే జర్నలిస్టులను భయపెట్టే సాధనంగా మారకూడదన్నారు. ప్రజాస్వామ్యానికి ముప్పు జర్నలిస్టుల హక్కులను అక్రిడేషన్ కార్డుతో ముడిపెట్టడం వల్ల ప్రశ్నించే స్వరం నెమ్మదిగా మౌనమవుతుందని, దాని ఫలితంగా ప్రజాస్వామ్యమే నష్టపోతుందని ఆయన హెచ్చరించారు. జర్నలిస్టులను "మంచిచెడు"గా వర్గీకరించడం ప్రజాస్వామ్యానికి తీరని నష్టమని, ప్రజల హక్కులను హరించే ప్రయత్నమని అన్నారు. ఉద్యమస్ఫూర్తితో హైలెట్స్ ɑ అక్రిడేషన్ కార్డు జర్నలిస్టు హోదాకు ప్రమాణం కాదు ɑ పత్రిక ఎడిటర్ ఇచ్చే గుర్తింపు కార్డే అసలు గుర్తింపు ɑ భారత ప్రభుత్వం గుర్తించిన ప్రతి పత్రిక ప్రామాణికమే అక్రిడేషన్ పేరుతో ప్రశ్నించే జర్నలిస్టులపై అణచివేత ప్రభుత్వాల చేతుల్లోనే అక్రిడేషన్ వ్యవస్థ అన్యాయానికి తావు జర్నలిస్టుల వర్గీకరణ ప్రజాస్వామ్యానికి ముప్పు ɑ ప్రశ్నించే గొంతులే ప్రజాస్వామ్యానికి ప్రాణం ప్రజాస్వామ్యంలో జర్నలిజం స్వేచ్ఛగా, నిర్భయంగా పనిచేయాలంటే అక్రిడేషన్ వ్యవస్థను తక్షణమే పారదర్శకంగా, న్యాయంగా మార్చాల్సిన అవసరం ఉందని, జర్నలిస్టుల గొంతు నొక్కే సాధనంగా దాన్ని వాడటం ఆపాలని అఖిల భారతీయ జర్నలిస్టు ప్రొటెక్షన్ ఫోర్స్ డిమాండ్ చేసింది.

## టేకుర్తి మోడల్ స్కూల్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట :** టేకుర్తి గ్రామంలోని మోడల్ స్కూల్ ప్రాంగణంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టేకుర్తి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, ప్రసంగం, చిత్రలేఖనం తదితర పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూడ "దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, వారు విద్యతో పాటు క్రమశిక్షణ, దేశభక్తిని అలవర్చుకోవాలని" అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో జాతీయ స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఫలితమే గణతంత్ర దినోత్సవం




కాశిరెడ్డి గూడా సర్పంచ్ రామలింగం గౌడ్.. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఫలితంగానే మనం గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని కాశిరెడ్డి గూడా సర్పంచ్ రామలింగం గౌడ్.. అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫరూఖ్ నగర్ మండలంలోని కాశిరెడ్డిగూడా గ్రామంలో సర్పంచ్ రామలింగం గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కులు రాజ్యాంగ పరంగా మనకు రావాలంటే తప్పకుండా దానిని సంబంధించిన రాజ్యాంగ రచించిన రచనలు వలన మనకు రిజర్వేషన్లు రావటం వలన ప్రజలకు మేలు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు గ్రామస్థులు యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతిభకు గుర్తింపు అరకు సీఐ హిమగిరికి కలెక్టర్ ప్రశంసలు

**ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్‌కు ముద్ర: ఉత్తమ సీఐ అవార్డు అందుకున్న ఎల్. హిమగిరి**



**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు తలార్సింగి,సీ హెచ్, స్కూల్ ప్రాంగణంలో 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ శాఖలో విశేష సేవలందించిన అధికారులకు ఘనంగా సత్కారం జరిగింది. ఈ సందర్భంగా అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ ఎల్. హిమగిరి గారికి ఉత్తమ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్గా ఎంపికై ప్రశంసల పత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మరియు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందజేయడం విశేషం. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో కఠిన చర్యలు, ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్ అమలు చేస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడంలో సీఐ హిమగిరి గారు చూపిన నిబద్ధత, సమర్థతకు గాను ఈ అవార్డును ప్రదానం చేసినట్లు అధికారులు తెలిపారు. అరకు సర్కిల్ పరిధిలో ప్రజల సమస్యలపై తక్షణ స్పందన, నేరాల నివారణలో ముందస్తు చర్యలు, శాంతియుత వాతావరణం నెలకొల్పడంలో ఆయన చేసిన సేవలు ప్రశంసనీయం అని కలెక్టర్, ఎస్పీలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఐటిడిఏ పీఓ తిరుమణి శ్రీ పూజా, ఇతర జిల్లా స్థాయి అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది అరకు సీఐ ఎల్. హిమగిరి ని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ అవార్డు అరకు పోలీసింగ్‌కు గర్వకారణంగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన హన్మకొండ జిల్లా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ



**సామాన్యుడి అస్త్ర కమలాపూర్ :** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షులు చంటి ముదిరాజ్ ఆదేశాల మేరకు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు జనగాని నాగరాజు ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా అధ్యక్షులు జనగాని నాగరాజు జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం (ဩ×)ను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు న్యాయం, పారదర్శకత అందించడంలో ဩ× కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర కోఆర్డినేటర్ కొంగంటి రాజుకుమార్ మాట్లాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా ဩ× సభ్యులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి, ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేలా సేవ చేయాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మీసాల విజయ్ మాట్లాడుతూ, ప్రతి జిల్లాలో ဩ× కమిటీలను మరింత బలోపేతం చేస్తూ, ప్రజాసమస్యల పరిష్కారానికి సమిష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ కొంగంటి రాజుకుమార్, తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మహేందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు విష్ణు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మీసాల విజయ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె సందీప్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు జనగాని నాగరాజు, హనుమకొండ జిల్లా ఇంచార్జి విజయ సూర్య, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి శివ, జిల్లా అధికార ప్రతినిధి అరవింద్, జిల్లా సెక్రెటరీ మారుతి, వర్కింగ్ ప్రెసిడెంట్ అన్వేష్, జిల్లా సెక్రెటరీ ప్రభాకర్ రెడ్డి, కమలాపూర్ మండల అధ్యక్షులు కోవరాజు సాగర్, కమలాపూర్ మండల ఇంచార్జి యాకూబ్‌తో పాటు ఇతర జిల్లా, మండల స్థాయి నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ధర్మాన్ని నిలబెట్టే పోరాటంలో ముందుండి నడిచేందుకు సిద్ధం

**19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా రాయబారపు సురేష్**

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు రాజకీయంగా కీలకంగా మారుతోంది. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నుంచి కౌన్సిలర్ అభ్యర్థిగా రాయబారపు సురేష్ ఎన్నికల బరిలో నిలిచి ప్రజా ఆశీర్వాదం కోరుతున్నారు. న్యాయం, ధర్మం, నిస్వార్థ ప్రజాసేవ అనే సిద్ధాంతాలతో ముందుకు సాగుతున్నానని, ప్రజా సమస్యల పరిష్కారమే తన రాజకీయ లక్ష్యమని ఆయన స్పష్టం చేస్తున్నారు. సోమవారం మీడియాతో మాట్లాడిన రాయబారపు సురేష్డ రాజకీయాలను పదవుల కోసం కాదు, ప్రజల కోసం చేయాలన్న ఆలోచనతోనే తాను ఎన్నికల బరిలోకి దిగినట్లు తెలిపారు. కరోనా వంటి కష్టకాలాల్లో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, మౌలిక వసతుల లోపాలు తనను రాజకీయాల్లోకి రావడానికి ప్రేరేపించాయని పేర్కొన్నారు. వార్డు ప్రజలు తనను ఆశీర్వదించి ఒక అవకాశం ఇస్తే, స్వార్థరహితంగా, నిష్పక్షపాతంగా సేవ చేస్తూ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా, సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడే కౌన్సిలర్‌గా తాను నిలుస్తానని చెప్పారు. వార్డు ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా, వాటికి శాశ్వత పరిష్కారాలు చూపడమే తన లక్ష్యమని తెలిపారు. వ్యక్తిగత లాభాల కోసం రాజకీయాల్లోకి రాలేదని, ప్రజాసేవే ధ్యేయంగా, ధర్మాన్ని నిలబెట్టేందుకే ఈ పోటీ చేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. సేవే లక్ష్యంగ ప్రజలే ప్రేరణ తనను నిండు మనసుతో ఆదరించి కౌన్సిలర్‌గా గెలిపిస్తే, 19వ వార్డు ప్రజలందరికీ అర్హులైన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా పూర్తి బాధ్యత తీసుకుంటానని రాయబారపు సురేష్ తెలిపారు. ప్రభుత్వ పథకాలు మధ్యవర్తుల చేతుల్లో పడకుండా, నేరుగా అర్హులకు చేరే విధంగా పారదర్శక పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. ఆడపిల్ల పుట్టిన ప్రతి అర్హ కుటుంబానికి పురిటి ఖర్చుల నిమిత్తం రూ.5,016/- కానుకగా అందజేస్తానని తెలిపారు. అలాగే రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. ప్రజలు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా వార్డు స్థాయిలో అవసరమైన సౌకర్యాలు కల్పించడమే తన ప్రధాన బాధ్యతగా భావిస్తానన్నారు. వార్డు పరిధిలో అనివార్య కారణాల వల్ల ఎవరైనా మృతి చెందితే, వారి కుటుంబాలకు దహన సంస్కారాల నిమిత్తం రూ.5,000/- ఆర్థిక సహాయం అందజేస్తానని వెల్లడించారు. అర్హులైన వారికి పింఛన్లు, రేషన్ కార్డులు ఇప్పించడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఆదివారం “వార్డు సందర్శన” కార్యక్రమం నిర్వహిస్తానని తెలిపారు. యువత, ముఖ్యంగా నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై విశ్వసనీయ సమాచారం అందిస్తూ వారిని ముందుకు నడిపిస్తానని చెప్పారు. వృద్ధులు, మహిళలకు పింఛన్లు వార్డులోనే సమీప కేంద్రాల్లో అందేలా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ప్రతి



కార్యక్రమాన్ని ముందస్తు సమాచారంతోనే నిర్వహించి, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతానని అన్నారు. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా, జనం పక్షాన నిలబడి పనిచేసే నాయకుడిగా మాత్రమే కాక సేవకుడిగా 24/7 ప్రజలకు అందుబాటులో ఉంటానని రాయబారపు సురేష్ హామీ ఇచ్చారు. ప్రజలు తనను ఆదరించి ఆశీర్వదించి ఒక్క అవకాశం ఇచ్చి కౌన్సిలర్‌గా గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు

# అణచివేత పొరల కింద నలిగిన కోట్లాది గొంతుకల విముక్తి రాగం ఈ గణతంత్రం

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మికుంట మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. జమ్మికుంట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్ నేతృత్వంలో, స్థానిక మోత్కులగూడెం అంబేద్కర్ చౌరస్తాలోని యూత్ కాంగ్రెస్ మండల కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, యువకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మొలుగూరి సదయ్య, యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి సజ్జు, యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్ మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న బ్రిటిష్ పాలన నుంచి దేశం విముక్తి పొందినప్పటికీ, నిజమైన స్వాతంత్ర్యం మాత్రం గణతంత్ర రాజ్యాంగ అమలుతోనే సిద్ధించిందని పేర్కొన్నారు. దేశాన్ని ఎలా పాలించాలి, అధికారాలు ఎవరి చేతిలో ఉండాలి, ప్రజల హక్కులువిధులు ఏమిటన్న స్పష్టత రాజ్యాంగంతోనే ఏర్పడిందన్నారు. బ్రిటిష్ పాలనలో కొనసాగిన రాజురాణి రాచరిక వ్యవస్థకు తెరదించి, ప్రజలే తమ ప్రతినిధులను ఎన్నుకునే ప్రజాస్వామ్య వ్యవస్థను స్థాపించాలనే లక్ష్యంతో 1950 జనవరి 26న భారత రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. జనవరి 26నే రాజ్యాంగ దినంగా ఎంపిక చేయడానికి కారణం1930 జనవరి 26న లాహోర్‌లోని రావి నది ఒడ్డున జరిగిన కాంగ్రెస్ సమావేశంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ తదితరులు పూర్ణ స్వరాజ్యం కోసం తీర్మానం చేసి తొలిసారిగా జాతీయ జెండాను ఎగరవేసిన చారిత్రక ఘట్టమని గుర్తు చేశారు. ఆ తరువాత 17 ఏళ్లపాటు జనవరి 26ను స్వాతంత్ర్య సంకల్ప దినంగా జరుపుకున్నామని, చివరికి 1947లో అధికారిక స్వాతంత్ర్యం లభించిందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో రాజ్యాంగ పరిషత్ సమావేశాలు నిర్వహించి, వేల కులాలు, వందల మతాలు, అనేక భాషలు, పేదరికం, నిరక్షరాస్యత వంటి సవాళ్ల మధ్య దేశాన్ని ఏకతాటిపై నిలబెట్టేలా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షతన భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసినట్లు తెలిపారు. దాదాపు 2 సంవత్సరాలు 11 నెలలు 18 రోజులు పాటు శ్రమించి, పది దేశాల రాజ్యాంగాల అధ్యయనంతో ప్రపంచంలోనే అతిపెద్ద లిఖితపూర్వక రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. అమెరికా నుంచి మౌలిక హక్కులు, రష్యా నుంచి విధులు, ఫ్రాన్స్ నుంచి స్వేచ్ఛసమానత్వం వంటి విలువలను స్వీకరించి, మత స్వేచ్ఛ, భాషా హక్కులు, మహిళా హక్కులు, రిజర్వేషన్లు వంటి అంశాలపై స్పష్టమైన దృష్టితో భారతదేశం మళ్లీ బానిసత్వంలోకి జారకుండా పటిష్టమైన నిబంధనలు రూపొందించారని



పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే అంటరానితనాన్ని అనుభవించిన అంబేద్కర్, అదే అనుభవాన్ని బలంగా మలిచి దేశ దిశను మార్చే రాజ్యాంగాన్ని రచించారని, “ఎడ్యుకేషన్ ఈజ్ ద మోస్ట్ పవర్‌ఫుల్ వెపన్” అన్న మాటలు ఈ సందర్భంగా మరింత ప్రాసంగికమని అన్నారు. రాజ్యాంగం న్యాయవాదులు మాత్రమే రాసిన గ్రంథం కాదని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ప్రతిరూపమని, అందులోని హక్కులు పొందడమే కాకుండా విధులను కూడా పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోత్కులగూడెం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో హుజూరాబాద్ యువకుడి సంచలనం

**హ్యామర్ త్రోలో బంగారు పతకం జాతీయ క్రీడారత్న పురస్కారానికి ఎంపిక**

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన వంతడుపుల రఘు అంతర్జాతీయ అథ్లెటిక్స్ రంగంలో అసాధారణ ప్రతిభ కనబరుస్తూ భారత దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారు. హ్యామర్ త్రో విభాగంలో ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించి క్రీడా వర్గాల్లో సంచలనం సృష్టించారు. సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగడం రఘు పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావానికి నిదర్శనంగా నిలిచింది. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ నిరంతర సాధనతో ఈ స్థాయికి చేరుకున్న ఆయన యువతకు ఆదర్శంగా మారారు. రఘు విశేష కృషిని గుర్తించిన వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని వసుంధర విజ్ఞాన వికాస మండలి (రి), ఆయనను ప్రతిష్ఠాత్మకమైన జాతీయ క్రీడారత్న పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు మధుకర్ వైద్యుల మాట్లాడుతూ, “అంతర్జాతీయ వేదికపై దేశ జెండాను ఎగరవేసిన రఘు విజయాన్ని గుర్తించడం గర్వంగా ఉంది. క్రీడారంగంలో మరింత ముందుకు వెళ్లేందుకు ఈ పురస్కారం ప్రోత్సాహకంగా నిలుస్తుంది” అని తెలిపారు. కన్వీనర్ ఈ. సుమలత మాట్లాడుతూ, త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో రఘు కి జాతీయ క్రీడారత్న పురస్కారంతో పాటు ఘనంగా సత్కరించనున్నట్లు వెల్లడించారు. రఘు కి ఈ ఘన విజయంతో చెల్పూర్ గ్రామం మాత్రమే కాకుండా హుజూరాబాద్ మండలం, కరీంనగర్ జిల్లా మొత్తం గర్వంతో ఉప్పొంగుతున్నాయి. పలువురు ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు, గ్రామస్తులు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు



సాధించాలని ఆకాంక్షించారు

# ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

**హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టోను సీఎం రేవంత్ రెడ్డి తుంగలో తొక్కుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అనేక అబద్ధాలు, అడ్డగో లు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పక్కన పెట్టారు, పరిపాలన వదిలేశారని మండిపడ్డారు. చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేత, మాజీ ఎంపీపీ విజయ్ భాస్కర్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఇవాళ బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్ గులాబీ కండువా కప్పి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇలా హామీలిచ్చి అందర్నీ మోసం చేస్తుందని ఆనాడే చెప్పామని.. అన్నట్లుగానే రెండేళ్లలో రేవంత్ రెడ్డి ఏ ఒక్క వర్గాన్ని వదిలిపెట్టకుండా అందర్నీ మోసం చేశాడని తెలిపారు. వృద్ధుల నుంచి మొదలు ఆడబిడ్డల వరకు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు.. ఇలా అందర్నీ రేవంత్ రెడ్డి మోసం చేస్తూనే ఉన్నాడని అన్నారు. కేసీఆర్ పాలనలో సంతోషంగా ఉన్న అన్ని వర్గాలు ఈరోజు కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు.సనసభ స్పీకర్ ధృతరాష్ట్రుని లెక్క మారాడని.. కళ్ళకు గంతలు కట్టుకొని నిజాలు చూడలేకపోతున్నాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో ,చేరి కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటే స్పీకర్ మాత్రం గుర్తించడం లేదని విమర్శించారు. యాదయ్య ఇంకా భారత రాష్ట్ర సమితిలోనే ఉన్నాడని చెబుతున్నాడని పేర్కొన్నారు.

# ఉప్పల్ అమర్శెట్టి బద్రీనాథ్ కి ఎమర్జెన్సీ, టెక్నీషియన్, ఉత్తమ ఉద్యోగి అవార్డు

**ప్రశంస పత్రాన్ని అందజేసిన కరీంనగర్ జిల్లా, వైద్య అధికారి డాక్టర్ వెంకటరమణ**

**డ్యూటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన, బద్రీనాథ్**



**సామాన్యుడి అస్త్ర కమలాపూర్ :** కరీంనగర్ జిల్లా,లోని, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో,77వ, గణతంత్ర దినోత్సవం సందర్భంగా, ఉత్తమ ఉద్యోగి, అవార్డు అందుకున్న జమ్మికుంట 108 అంబులెన్స్ సిబ్బంది. అంబులెన్స్ సర్వీస్ లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గా పని చేస్తున్నటువంటి అమీర్ శెట్టి బద్రీనాథ్ డ్యూటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సన, మరియు 108 జిల్లా మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్ బద్రీనాథ్ ను అభినందించారు. బద్రీనాథ్ మాట్లాడుతూ, అవార్డుని నేను దక్కించుకున్నందుకు గాను నా తోటి ఉద్యోగులకు మరియు, జిల్లా 108 ఎమర్జెన్సీ, సూపర్వైజర్, మేనేజర్, అలాగే,నాకు, సహకరించిన,ప్రతి ఒక్కరికి, ధన్యవాదములు, తెలియజేశారు,

# గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సేవా సందేశం

**బూజునూరు పాఠశాల, అంగన్వాడి చిన్నారులకు చలి కోట్లు పంపిణీ**



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట :** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సంఘమిత్ర సొసైటీ ఆధ్వర్యంలో ఆదర్శవంతమైన సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడి కేంద్రంలో చదువుతున్న విద్యార్థినివిద్యార్థులకు చలి నుంచి రక్షణ కల్పించే స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం సంఘమిత్ర సొసైటీ ఫౌండర్ సరిగొమ్ముల హరిప్రసాద్ (చీ=×) ఆధ్వర్యంలో నిర్వహించబడింది. సమాజంలో వెనుకబడిన వర్గాల విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ, గణతంత్ర దినోత్సవం యొక్క అసలైన భావనను ప్రతిబింబించేలా ఈ సేవా కార్యక్రమం సాగింది. చలి తీవ్రత పెరుగుతున్న తరుణంలో చిన్నారులకు స్వెటర్లు పంపిణీ చేయడం ద్వారా వారి ఆరోగ్య భద్రతకు తోడ్పాటు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యతో పాటు మానవీయ విలువలు కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర సొసైటీ ప్రధాన కార్యదర్శి పోలే క్రాంతి కుమార్, దళిత రత్న సరిగొమ్ముల మనోహర్, సరిగొమ్ముల శ్రీనివాస్, సరిగొమ్ముల సూర్య ప్రకాష్, సరిగొమ్ముల దయాకర్ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. అలాగే ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్, ఉపాధ్యాయురాళ్లు నికిత, మౌనిక, అంగన్వాడి టీచర్ రజితతో పాటు పాఠశాల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని సహకరించారు. స్వెటర్లు అందుకున్న చిన్నారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరియగా కనిపించగా, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా సంఘమిత్ర సొసైటీ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని వారు కోరారు

# అగ్రికల్చర్ ప్రైవేట్ ఉద్యోగులకు రూ.10 లక్షల బీమా

**80 మందికి ఇన్సూరెన్స్ బాండ్ పత్రాల అందజేత**

**ఫర్టిలైజర్ షాప్స్ అసోసియేషన్, ఏవోకు యూనియన్ అధ్యక్షుడి కృతజ్ఞతలు**




**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** జమ్మికుంట ఫర్టిలైజర్ షాప్స్ అసోసియేషన్, మండల వ్యవసాయ అధికారి సౌజన్యంతో జమ్మికుంట అగ్రికల్చర్ ప్రైవేట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బృహత్తర కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలో యూనియన్ మండల అధ్యక్షుడు అంబాల రజనీకాంత్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అనంతరం యూనియన్ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి అగ్రికల్చర్ ప్రైవేట్ ఉద్యోగికి రూ.10 లక్షల చొప్పున మొత్తం 80 మంది సభ్యులకు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించారు. ఇందుకు సంబంధించిన ఇన్సూరెన్స్ బాండ్ పత్రాలను ఉద్యోగులకు అందజేశారు. ఈ సందర్భంగా అంబాల రజనీకాంత్ మాట్లాడుతూ, తమ కుటుంబాల భద్రత కోసం ముందుచూపుతో ఆలోచించిన ఫర్టిలైజర్ షాప్స్ అసోసియేషన్ సభ్యులకు, మండల వ్యవసాయ అధికారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్పందన బ్లడ్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆపదలో ఉన్నవారికి రక్తం అందించి ప్రాణాలు నిలబెట్టే పవిత్ర కర్తవ్యానికి నిబద్ధతతో 15 మంది సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, పిట్టల మధు, చిలక శివ, రాజేష్, నవీన్ గౌడ్, సీహెచ్ ఉపేందర్, పెద్ది సంతోష్, అంబీర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారుద

# భీంపల్లి సగర సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ మరియు జెండా ఆవిష్కరణ

**కుల సంఘ భవనంలో ఘనంగా నిర్వహణ**

**కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి (అయోధ్య) కుమారస్వామి సంఘ సభ్యులు**



**సామాన్యుడి అస్త్ర కమలాపూర్ :** హనుమకొండ జిల్లా, కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామంలో సగర సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా, భీం పెల్లి గ్రామ సగర సంఘ సభ్యుల ఆధ్వర్యంలో జరిగినటువంటి,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి (అయోధ్య) కుమారస్వామి మాట్లాడుతూ, సగర సంఘాన్ని మరింత బలోపేతం చేసి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చేలా అభివృద్ధి చేయాలని సూచించారు. సంఘ సభ్యుల సమిష్టి కృషితో సంఘానికి మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్ద గూడెం తాండ నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి

**వనపర్తి :** వనపర్తి మండలం పెద్దగూడెం తండా రూ. 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని సోమవారం వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి గారు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనరెడ్డి ప్రారంభించారుఈ సందర్భంగా ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా ఎన్నుకోబడ్డ శ్రీ వాళ్య నాయక్ ని సర్పంచ్ చాంబర్లో శాలువాలు పూలమాలలతో సత్కరించి సన్మానించారు. గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు పనిచేయాలని, పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని వారు సూచించారు గ్రామాభివృద్ధికి కావలసిన పనుల మంజూరిలో ఎల్లవేళలా సహకరిస్తామని ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వారు కోరారుకార్యక్రమంలో వనపర్తి మండల మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, శంకర్ నాయక్, మండలాధ్యక్షుడు రవి కిరణ్, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, మార్కెట్ మాజీ అధ్యక్షులు ఎత్తం రవి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు గ్రామస్తులు అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు జాతీయ జెండాను ఆవిష్కరించిన పోలీస్ కమిషనర్

**సిద్దిపేట :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ ఘనంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు.కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ ఎస్ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ.దేశ సార్వభౌమాధికారాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడటంలో ప్రతి పోలీస్ అధికారి అంకితభావంతో పనిచేయాలని,ప్రజల భద్రతే లక్ష్యంగా, శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతికతను జోడించి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.రాజ్యాంగం కల్పించిన హక్కులు మరియు బాధ్యతలను స్మరించుకుంటూ, విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు:కార్యాలయంలో జెండా ఆవిష్కరణ అనంతరం, కమిషనర్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రధాన గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు. అక్కడ పోలీసు దళాల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ కె. హైమవతి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురు అధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ కె.హైమవతి కమిషనర్ చేత ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ వేడుకల్లో అదనపు డీసీపీ ఎ ఆర్. సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు, ఇన్స్పెక్టర్ లు,ఎస్ ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు జాతీయ జెండాను ఆవిష్కరించిన పోలీస్ కమిషనర్

**సిద్దిపేట :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ ఘనంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు.కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ ఎస్ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ.దేశ సార్వభౌమాధికారాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడటంలో ప్రతి పోలీస్ అధికారి అంకితభావంతో పనిచేయాలని,ప్రజల భద్రతే లక్ష్యంగా, శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతికతను జోడించి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు మరియు బాధ్యతలను స్మరించుకుంటూ, విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

**పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు..**


కార్యాలయంలో జెండా ఆవిష్కరణ అనంతరం, కమిషనర్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రధాన గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు. అక్కడ పోలీసు దళాల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ కె. హైమవతి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురు అధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ కె.హైమవతి కమిషనర్ చేత ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ వేడుకల్లో అదనపు డీసీపీ ఎ ఆర్. సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు, ఇన్స్పెక్టర్ లు,ఎస్ ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జమ్మికుంట కేరళ పాఠశాలలో ఘనంగా 77వగణతంత్ర దినోత్సవ వేడుకలు




**అస్త్రం జమ్మికుంట:** జమ్మికుంట మండలం కేరళ పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె ఎస్ బెన్నీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వారి బానిసత్వం నుండి మన భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన అనంతరం మనల్ని మనం పరిపాలించడానికి ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేతృత్వంలో రాజ్యాంగ పరిషత్ రూపొందించిన రాజ్యాంగం 1949 నవంబర్ 26న ఆమోదం పొంది 1950 జనవరి 26 నుండి అధికారికంగా అమల్లోకి వచ్చింది అని గుర్తు చేశారు ఈ గణతంత్ర దినోత్సవంలో ఎందరో మహనీయుల త్యాగాలు గుర్తు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునే విధంగా దేశభక్తిని ప్రజల్లో పెంపొందించడమే దీని లక్ష్యమని గుర్తు చేశారు అదేవిధంగా విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి క్రమశిక్షణతో శ్రద్ధ పెట్టి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి ఉపయోగపడాలని విద్యార్థులకు సూచించారు విద్యార్థులు అలంకరించిన స్వతంత్ర సమరయోధుల వేషాలను పాఠశాల ప్రాంగణమంతా మైమరిపించాయి ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని క్రీడలలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు.

## నిడదవోలు నియోజకవర్గంలో బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు.



**సామాన్యుడి అస్త్రం నిడదవోలు :** దేశవ్యాప్తంగా జరుగుతున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా, నిడదవోలు నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ నాయకులు జాతీయ పతాకాన్ని అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఆవిష్కరించారు. బిజెపి పట్టణ అధ్యక్షులు మార్త ప్రమోద్ కుమార్, సీనియర్ నాయకులు జాతీయ జెండాను ఎగురవేసి, భారత రాజ్యాంగ విలువలను కాపాడతామని కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం మనందరికీ కల్పించిన హక్కులు, బాధ్యతలే దేశ ప్రగతికి పునాదులు. ప్రధాని నరేంద్ర మోదీ గారి దార్శనికతతో భారత్ నేడు ఆర్థికంగా, రక్షణ పరంగా అగ్రదేశాల సరసన నిలుస్తోంది“ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓటమి నాయకులు, బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యానికి బలం ప్రజాదర్బార్

### 2026 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఇల్లందకుంట తాసిల్దార్ భాస్కర్




**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** ప్రజల సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకొస్తూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న ప్రజాదర్బార్ దినపత్రిక జర్నలిజంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని ఇల్లందకుంట తాసిల్దార్ బి. భాస్కర్ అన్నారు. సోమవారం ఇల్లందకుంట తాసిల్దార్ కార్యాలయంలో ప్రజాదర్బార్ దినపత్రిక 2026 సంవత్సరానికి సంబంధించిన నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ఎలాంటి భయభ్రాంతులు లేకుండా ప్రజల ముందుకు తీసుకువెళ్లడంలో ప్రజాదర్బార్ దినపత్రిక ముందువరుసలో ఉందని ప్రశంసించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి స్వతంత్ర, బాధ్యతాయుతమైన జర్నలిజం ఎంతో అవసరమని, ప్రజా సమస్యలపై నిరంతరం దృష్టి సారించే పత్రికలు సమాజాన్ని సరైన దిశలో నడిపిస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను సేకరించి సంబంధిత శాఖల దృష్టికి తీసుకువెళ్లడంలో మీడియా పాత్ర కీలకమని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా ప్రచురిస్తూ, ప్రభుత్వ పథకాలు ప్రజల వరకు చేరేలా చేయడంలో ప్రజాదర్బార్ దినపత్రిక విశేషంగా కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాదర్బార్ దినపత్రిక రిపోర్టరు లకిడే అనిల్, జక్కే బాలరాజు, పైడిపల్లి భీమన్న, ఇంగిలే ప్రభాకర్, శ్రీనివాస్ రెడ్డి, గుండెకారి మధు, అనిల్, మాచర్ల వినయ్, శివ పాల్గొన్నారు. అలాగే ఆర్ఐ రంజిత్ రెడ్డి, రామకృష్ణ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## ఉత్తమ ఉద్యోగిగా జమ్మికుంట మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్‌కు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస




**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలో సానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పి. మహేష్ ఉత్తమ ఉద్యోగిగా ఎంపికై సోమవారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. పట్టణంలోని వార్డులలో చెత్త సేకరణ, చెత్తను తగ్గించే కార్యక్రమాలు, పారిశుధ్య నిర్వహణలో ఆయన చూపిన చిత్తశుద్ధి, అంకితభావానికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే దిశగా మున్సిపల్ కార్మికులతో సమన్వయంగా పనిచేస్తూ, చెత్తను వేరు చేయడం, సకాలంలో తరలింపు, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను మహేష్ విజయవంతంగా అమలు చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ తెలిపారు. ఈ క్రమంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ, మున్సిపల్ సిబ్బంది పట్టణ ఆరోగ్యానికి ప్రధాన రక్షకులని, వారిలో మహేష్ ఒకడిగా ప్రత్యేక గుర్తింపు సాధించారన్నారు. ఈ పురస్కారం మహేష్‌కు లభించడం మున్సిపాలిటీకి గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని బాధ్యతలు చేపట్టి ఇలాంటి పురస్కారాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ చేతుల మీదుగా మహేష్‌కు ప్రశంసాపత్రం అందజేశారు. మహేష్‌కు ఈ గౌరవం దక్కినందుకు మున్సిపల్ కార్యాలయంలోని పలువురు అధికారులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వాణి, భాస్కర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సదానందం, ఈఈ శ్రీకాంత్‌తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు

## పాతర్లపల్లిలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

### పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్లు పంపిణీ



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట :** పాతర్లపల్లి గ్రామంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన మహనీయులకు నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య ప్రాధాన్యతపై ప్రసంగాలు నిర్వహించారు. కార్యక్రమం అనంతరం గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు ఉపసర్పంచ్ చల్లూరి కుమార్ బుక్స్ మరియు పెన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్తులో దేశానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి వెంకటరమణ రెడ్డి, గ్రామ కార్యదర్శి కామిశెట్టి శ్రీకాంత్, వార్డు సభ్యులు కోడం నవీన్, చల్లూరి ఈశ్వరమ్మ, చల్లూరి రేణుక, చల్లూరి మొగిలి, రామ్ శ్రావణ్, మొలుగు అఖిల, కోడం రోహిణి, వాసు, శివకృష్ణ, సంపత్, శ్రీధర్, కిరణ్, శ్రీనివాస్, చిరంజీవి పాల్గొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు

# సింగరేణి సంస్థ ఆర్ జి త్రీ, ఏఎల్‌పిలలో గణతంత్ర దినోత్సవం

**కమాన్ పూర్ :** రామగిరి మండలం సెంటినరీ కాలనీలో నీ ఆర్ జి త్రీ పరిధిలో మరియు అడ్డాల లాగ్వాల్ ప్రాజెక్టులో గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి.77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి సంస్థ రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల ఆధ్వర్యంలో జి.యం. కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలం దరికీ, స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం అందిస్తూ రూపొందిం చిన భారత రాజ్యాంగానికి 77 సంవత్సరాలు గడిచాయని, అందరము బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. తదుపరి స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ప్రధాన వేడుకల్లో రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తదుపరి నిర్వహించిన కవాతు ప్రదర్శనలో భాగంగా ఏరియా సెక్యూరిటీ సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవానికి ఒక ప్రత్యేకత ఉందని వందేమాతరం గీతాన్ని ఆలపించి నేటికీ 150 సంవత్సరాలు అయిందని, దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం అందిస్తూ రూపొం దించబడిన మన భారత రాజ్యాంగం 1950, జనవరి 26 న అమలులోకి వచ్చింద న్నారు. ప్రజలే పాలకులుగా రూపు దిద్దుకున్న మన భారత దేశానికి ఒక దశ, దిశ కల్పించడం కోసం రాజ్యాంగ రూపక ల్పన చేశారన్నారు. భారత రాజ్యాంగ ప్రతిని రూపొందించిన కమిటీకి అధ్యక్షుడిగా వ్యవహరించి, రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారిని మనం మరిచిపోలేమన్నారు. వారు దేశంలోని భిన్న నాగరికతలు, భిన్న మతాలు, కులాలు, ప్రాంతాలకు ప్రాధాన్యమిస్తూ రాజ్యాంగ రూపకల్పన చేశారన్నారు. ప్రతీ ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని గ్రహించి, హక్కుల కోసమే కాకుండా, బాధ్యతలను కూడా తెలుసుకొని జీవించాలన్నారు. సింగరేణి సంస్థ యాజమాన్యం ఉద్యోగుల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రతి ఉద్యోగి భద్రత తో వారి వారి స్థాయిలో బాధ్యతతో కూడిన విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం మార్కెట్ లో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా పని చేస్తేనే సంస్థ మనుగడ సాధ్యమవుతుందని అన్నారు.ఉద్యోగుల కుటుంబ సభ్యుల కోసమే కాకుండా పరిసర ప్రాంతాల ప్రజల కోసం ఎన్నో సామాజిక, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా, సంస్థ సామాజిక బాధ్యత క్రింద కోట్లాది రూపాయలు వెచ్చించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపా రు. అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు. వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. గత సంవత్సరం విజిలెన్స్ అవగాహన వారత్సోవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. కోల్ ఇండియా స్థాయిలో వివిధ విభాగాల్లో గెలుపొందిన వారిని సన్మానించారు. సెక్యూరిటీ సిబ్బందికి నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ వేడుకల్లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు, ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షులు కోల శ్రీనివాస్, ఎస్వోటు జియంలు యం. రామ్మోహన్, బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షబ్బీరుద్దీన్, వివిధ గనుల, విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, సేవా సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కుందారం ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా

**సామాన్యుడి అస్త్రం జనగామ** కుందారం ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగినవి. గ్రామ సర్పంచ్ కూకట్ల రాజు ముఖ్యఅతిథిగా హాజరైనారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిట్ల రవిశంకర్ పతాకావిష్కరణ గావించిన పిదప జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి సర్పంచ్ కూకట్ల రాజు మాట్లాడుతూ, అంబేద్కర్, గాంధీ, పటేల్ మరియు భగత్ సింగ్ వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని నేటి విద్యార్థులంతా గొప్ప స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థుల యొక్క సమగ్ర అభివృద్ధితో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందని, గ్రామంలోని బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలని పేర్కొన్నారు. తదనంతరం ఆటలు సాంస్కృతిక పోటీల్లోని విజేతలకు సుమారు 13 వేల రూపాయల విలువైన మెమెంటోలు సర్పంచ్ స్వయంగా విద్యార్థులకు అందించారు. ఈ సమావేశంలో గత సంవత్సరం ఎస్ఎస్సి టాపర్ ఈ అక్షయ 526/600 మార్కులు సాధించగా,పాఠశాలలో పనిచేయుచున్న తెలుగు ఉపాధ్యాయులు వి.శ్రీనివాసచారి వారి నాన్న కీర్తిశేషులు వెంకటాచారి జ్ఞాపకార్థం మీద ఐదు వేల రూపాయలు నగదు బహుమతి మరియు గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు వీరస్వామి ఒక వెయ్యి రూపాయల నగదు బహుమతి అందించారు మరియు గ్రామ యువకులు చిర్రా అశోక్ 10వ తరగతి 27 మంది విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్ ఎగ్జామ్ కిడ్స్ అందించారు. ఈ సందర్భంగా ఇటీవల దక్షిణ భారతదేశ స్థాయి సైన్స్ ఫెయిర్ లో టీచర్ ఎగ్జిబిట్ ప్రదర్శనలు ప్రత్యేక బహుమతి పొందిన పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు బండోజు శ్రీనివాస చారి ని సర్పంచ్ రాజుగారు,హెచ్ఎం ,వార్డ్ మెంబర్లు మరియు ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాలమాకుల రవి ఏఏపిసి చైర్పర్సన్ కొంగరి సుమలత,గ్రామ పెద్దలు వంగ నాగరాజు, దారం అశోక్,చిర్ర వీరస్వామి మరియు



వార్డ్ మెంబర్స్ బైరి శ్రీకాంత్, మర్రిపల్లి సంధ్య, అస్లాం పాషా , సజ్జన ఉదయ్ మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం బండోజు శ్రీనివాస చారి, వెంకటేశ్వర్లు రజిత ,కృష్ణవేణి, రమాదేవి, సుధారాణి, రజిని, బి రాములు, వి శ్రీనివాసచారి మరియు సిబ్బంది సిద్ధార్థ, హుస్సేన్, సుగుణమ్మ పాల్గొన్నారు

## హన్మంతాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**సామాన్యుడి అస్త్రం జనగామ** నర్మెట్ట మండలంలోని హన్మంతాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూడల రమేష్ జాతీయ జెండాను ఆవిష్కరించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. రాజ్యాంగ విలువలు, దేశభక్తి మరియు క్రమశిక్షణ ప్రాధాన్యతను ఆయన వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాల ఆలాపన, సాంస్కృతిక నృత్యాలు వంటి పాఠ్యేతర కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రామ ఉపసర్పంచ్ మూల కిరణ్ గౌడ్ రూ.3,000 విలువైన బహుమతులను అందజేసి ప్రోత్సహించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ముందుకు రావాలని అతిథులు సూచించారు. ఈ వేడుకలు ఆనందభరితమైన మరియు దేశభక్తితో నిండిన వాతావరణంలో ముగిశాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పండుగ జ్యోతి రమేష్, ఉపసర్పంచ్ మూల కిరణ్ గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ దూసరి కీర్తన, వార్డ్ మెంబర్లు కొర్ర పాపన్న, కొర్ర కృష్ణ, ఉపాధ్యాయులు విద్యావతి, ఆరోగ్యమ్మ, అంగన్వాడి టీచర్స్ మమత, సంధ్య, మహిళా పొదుపు సంఘం సీఏ పిన్నింటి కవిత, ఆశా వర్కర్లు కవిత, బైరగోని కవిత, ఆయాలు అనిత, స్వప్న, ఐలమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాకు అవమానం

**రంధ్రాలు పడి చిరిగిన జెండా ఎగరవేత**

**కొత్తపేటలో ఘటన**

**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. జాతీయ జెండా ఎగురవేసే క్రమంలో పాటించాల్సిన నిబంధనలను పక్కనపెట్టి వచ్చామా.. పోయామా అన్న విధంగా తమ పని కానిచ్చారు. రంధ్రాలు పడి చిరిగిన జెండాను ఎగరవేసిన అధికారులు తమ పని అయిపోయిందని అక్కడి నుండి వెళ్లిపోయిన ఘటన కేశంపేట మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కొత్తపేట ప్రాథమిక పశు వైద్య కేంద్రం ఆవరణలో రంధ్రాలు పడిన జాతీయ జెండాను పశు వైద్యాధికారి ఎగురవేసి వెళ్ళిపోయారు. ఇది కాస్త మీడియా కంట్లో పడటంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు..



## జనగామ అంబేద్కర్ నగర్ మండల ప్రజా పరిషత్ స్కూల్ లో 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**సామాన్యుడి అస్త్రం జనగామ** భారత రాజ్యాంగ రూపశిల్పి ప్రపంచ విజ్ఞాన మేధావి భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగము వ్రాసి దానిని దేశ ప్రజలకు అంకితం చేసి రాజ్యాంగ సభ 1949 నవంబర్ 26న ఆమోదించింది, 1950 జనవరి 26న నుంచి రాజ్యాంగం అమలులోకి వచ్చింది భారత ప్రజాస్వామ్య సర్వసత్తాక గణతంత్ర దేశంగా ఆవిర్భవించింది, సర్వసత్తాక లౌకిక గణతంత్ర ప్రజాస్వామ్య దేశముగా వచ్చిన శుభ తరుణం సందర్భంగా అధికారులకు,ప్రజాప్రతినిధులకు, కార్మికులకు, కర్షకులకు, ప్రజాస్వామ్య వాదులకు, మేధావులకు,కవులు కళాకారులకు, 77 వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనగామ లోని అంబేద్కర్ నగర్ లో (మండల ప్రజా పరిషత్ స్కూల్) స్కూల్లో జీవన్ గ్రీన్ ఓప్ సొసైటీ చైర్మన్ దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేసినారు ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ రమేష్ గారు మరియు స్కూల్ ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు మరియు సిబ్బంది కాలనీవాసులు అధిక



సంఖ్యలో పాల్గొని జెండా ఆవిష్కరించి అనంతరం 77వ భారత గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు

## ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు

**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ: సమాజంలో ప్రాథమిక హక్కులు హక్కులకు భంగం వాటిల్లకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని సాదిక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ సాదిక్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించడంతో పాటు చదువు విలువలను తద్వారా కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా రాబోయే ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి సంవత్సరం విద్యార్థులకు రూపాయలు 5000/-, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రూపాయలు 7500/- నగదు పురస్కారాన్ని సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తామని ప్రకటించారు. కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవ ప్రశంసా పత్రం అందుకున్న తెలుగు అధ్యాపకులు వీరస్వామి, పి.డి.రాజులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. అనిల్ బాబు, కోఆర్డినేటర్ వీరస్వామి, అధ్యాపకులు నాన్ టీచింగ్ స్టాఫ్ సిబ్బంది పాల్గొన్నారు. ఫోటో:



కార్యక్రమంలో మాట్లాడుతున్న సాదిక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మొహమ్మద్ సాదిక్ అలీ

## మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం.

**సామాన్యుడి అస్త్రం కోనరావుపేట :** కోనరావుపేట మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈరోజు 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండా ఆవిష్కరణ నిర్వహించడం జరిగింది, జాతీయ జెండాను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా గారు ఆవిష్కరించరు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశానికి దక్కని గౌరవం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారు రాజ్యాంగం రూపంలో మన దేశానికి అందించారని ఆ రాజ్యాంగాన్ని అమలుపరిచిన రోజుగా ఈరోజు మనం ఒక పండగల జరుపుకుంటామని కుల మతాలకు అతీతంగా భారతీయులందరికీ సమాన హక్కులను కల్పిస్తూ రాజ్యాంగాన్ని రూపొందించారని ఆ రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను మనం అందరం సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జిల్లా నాయకులు చందనగిరి గోపాల్ గొట్టే రుక్మిణి బండ నర్సయ్య చారి రమేష్ రెడ్డి గ్రామ అధ్యక్షులు మందాల లింబయ్య ప్రభాకర్ యూత్ అధ్యక్షులు బండి ప్రభాకర్ నిత్యనందం బోయిని లింబయ్య ధర్మయ్య మధుకర్ రెడ్డి రవీందర్ రెడ్డి మార్క్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## యశ్వంతాపూర్ సేక్ హై స్కూల్లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ జిల్లా యశ్వంతాపూర్ సేజ్ హై స్కూల్లో 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జనవరి 26 న అత్యంత ఘనంగా దేశభక్తి భావనలో జరిగాయి ముఖ్య అతిథి ప్రధానో పాధ్యాయులు వాదిరెడ్డి రోహాన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన కవాతు (మార్చ్ ఫాస్ట్) మరియు డంబుల్స్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగ నిలిచాయి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు ప్రధానో పాధ్యాయులు మాట్లాడుతూ మన రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య ప్రాముఖ్యతను గుర్తు చేశారు. దేశ భవిష్యత్తును రూపొందించడంలో విద్యార్థుల పాత్ర కీలకమని మరియు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఊడాలని వివరించారు. దేశ సమగ్ర అభివృద్ధికి ప్రతి పౌరుడు క్రమశిక్షణలో, దేశ భక్తి లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో విద్యార్థుల దేశభక్తి గీతాలు, సారస్యత కార్యక్రమాణ మరియు విద్యార్థుల స్వాతంత్ర సమరయోధుల వేషధారణలు ప్రేక్షకు లను ఆకట్టిన్నాయి. ఈ కార్యక్రమంలో ఈ పాధ్యాయలు, విన్యాసులు, తల్లిదండ్రులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు బహూకరణ

**ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా అధ్యక్షుడు**

**పొదల లవ కుమార్**



**సామాన్యుడి అస్త్రం జనగామ** రఘునాథపల్లి మండలంలోని అశ్వరావు పల్లి గ్రామం ఉన్నత పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా జరిగిన వేడుకలలో పాల్గొని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ఫ్యాడులు బహుకరణ చేయడం జరిగినది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా అధ్యక్షుడు పొదల లవ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నైతిక విలువలు కాపాడేందుకు ఎస్ఎఫ్ఐ అనునిత్యం పోరాడుతుందని అన్నారు అదేవిధంగా భారత రాజ్యాంగాన్ని విమర్శించే హక్కు ఎవరికీ లేదని అన్నారు భారత రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలని అదేవిధంగా రాజ్యాంగం ఏర్పడి 77 వసంతాలు అయినందున హర్షనీయమని అన్నారు అదేవిధంగా విద్యారంగంలో మూఢ విశ్వాసాలని పెంపొందించే విధంగా ఇప్పుడున్న ప్రభుత్వ పాలకులు తీసుకొచ్చే విద్యా వ్యతిరేక విధానాలను తిప్పుకొట్టే విధంగా విద్యార్థులు సిద్ధంగా ఉండాలని అన్నారు విద్యా వ్యవస్థను గాలికి వదిలేసే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు తక్షణమే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను మరియు భోజనాన్ని అందించాలన్నారు ఈ కార్యక్రమంలో గాజుల రాజు పొదల సాంబరాజు మనీత్ రాజ్ అశ్వరావు పల్లి ప్రధానోపాధ్యాయులు అశ్వరావు పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామ సర్పంచ్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అమ్మ అదశ పాఠశాల చైర్మన్ యువజన నాయకులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు



**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ: సమాజంలో ప్రాథమిక హక్కులు హక్కులకు భంగం వాటిల్లకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని సాదిక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ సాదిక్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించడంతో పాటు చదువు విలువలను తద్వారా కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా రాబోయే ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి సంవత్సరం విద్యార్థులకు రూపాయలు 5000/-, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రూపాయలు 7500/- నగదు పురస్కారాన్ని సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తామని ప్రకటించారు. కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవ ప్రశంసా పత్రం అందుకున్న తెలుగు అధ్యాపకులు వీరస్వామి, పి.డి.రాజులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. అనిల్ బాబు, కోఆర్డినేటర్ అధ్యాపకులు నాన్ టీచింగ్ స్టాఫ్ సిబ్బంది పాల్గొన్నారు. ఫోటో: కార్యక్రమంలో మాట్లాడుతున్న సాదిక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మొహమ్మద్ సాదిక్ అలీ

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.